ప్రజాశక్తి
మంగళవారం 21 మే 2024 8 పేజీలు
ప్రకాశం బాపట్ల







ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

'టంగుటూరి' స్ఫూర్తితో

జిల్లా అభివృద్ధికి చర్యలు

- కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్
- ప్రకాశం పంతులుకి నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ స్ఫూర్తితో జిల్లాను అన్ని విధాలా అభివద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ తెలిపారు. ఆంధ్రకేసరి వర్ధంతిని పురస్కరించుకుని పోమవారం కలెక్టరేట్‌లోని ఆయన విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యపోరాట యోధునిగా, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా పరిపాలనలో ప్రకాశం పంతులు తనదైన ముద్ర వేశారని కొనియాడారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని వివిధ రంగాలలో ఉన్నత స్థానానికి చేరాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లా అభివద్ధిలో ప్రజలందరూ ▶ 2లో

'వేట నిషేధ' భృతి కోసం

ఎదురుచూపులు..

- ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేట నిషేధం అమలు
- ఎన్నికల కోడ్ కారణంగా జరగని అర్హుల జాబితా తయారీ



వేట నిషేధ సమయం కావడంతో ఒడ్డున చేర్చి పడవలు (ఫైల్)


ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

సముద్రతీర ప్రాంతంలో ఉండే మత్స్యకారులకు చేపల వేటే జీవనాధారం. అయితే ప్రతి ఏడాదీ ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు సముద్రంలో చేపల వేట నిషేధాన్ని అమలు చేస్తున్నారు. ఈ సమయం సముద్రంలో చేపలు గుడ్లు పెట్టే కాలం కావడంతో చేపల గుడ్లు పునరుత్పత్తి జరిగే సంధికాలంగా పేర్కొంటూ సముద్రంలో వేట నిషేధం అమలులో ఉంటుంది. ఇందులో భాగంగా లోతైన సముద్రజలాల్లో వేటకు వెళ్లే మెకనైజ్డ్ బోట్లు, మోటరైజ్డ్ బోట్లు, నాన్ మోటరైజ్డ్ బోట్లతో సాగించే చేపలవేటకు తాత్కాలికంగా విరామం ప్రకటిస్తారు. వివిధ చేపలు, రొయ్యల జాతుల సంతానోత్పత్తి కాలంలో తల్లి చేప, రొయ్యలను సంరక్షించడం వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడం, తద్వారా సముద్రంలో మత్స్యసంపద పెంపొందించేందుకు ఏటా ఈ పద్ధతిని రాష్ట ప్రభుత్వం అమలు చేస్తుంది. సముద్రంలో వేట సాగని ఈ రెండు నెలల కాలం మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం మత్స్యకార భరోసా పేరిట ఆర్థిక సాయం అందిస్తుంది. ఈ సమయంలో మత్స్యకారుల ఆర్థిక చేయూత కోసం రూ.10 వేల చొప్పున వేట నిషేధకాల భృతిని ఇస్తున్నారు.

గతేడాది మే 16న జిల్లాలోని నిజాంపట్నం వచ్చిన సిఎం జగన్ మత్స్యకార భరోసా ద్వారా ఆర్థికసాయాన్ని విడుదల చేశారు. ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈ సారి చేపల వేట నిషేధం ఉంది. కానీ మత్స్యకారులకు నిషేధకాల భృతి మాత్రం అందలేదు. ఎన్నికల కోడ్ కారణంగా విధి విధానాలు ఖరారు కాక అర్హులైన మత్స్యకార కుటుంబాల ఎంపికల్లో జాప్యం నెలకొంది. నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో 74 కిలోమీటర్ల మేర సముద్రతీరం ఉంది. 65 మత్స్యకార గ్రామాల్లో 54 వేల మంది మత్స్యకారులున్నారు. జిల్లాలో అన్నిరకాల బోట్లు కలిపి 3,250 వరకు ఉన్నాయి. వేట నిషేధకాలంలో 61 రోజుల పాటు సముద్రంలో వేట నిలిచిపోవడంతో మత్స్యకారులు తమ జీవనాధారాన్ని కోల్పోతారు. ఈ కాలంలో బోట్లు, వలల మరమ్మత్తులు చేసుకుంటారు. ఈ కాలంలో కొందరు మత్స్యకారులు తమ బోటు యజమానులు ఇచ్చే సాయంతో జీవనం గడుపుతారు. ఈ నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం మత్యకార భరోసా పేరుతో రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తుంది. గతేడాది జిల్లాలో 12,466 మంది మత్స్యకారులకు ఆర్థిక సాయం అందించడం జరిగింది.

వేట నిషేధ కాలంలో ▶ 2లో

విశ్రాంతిలో అభ్యర్థులు



- గణాంకాలు.. బెట్టింగుల్లో అనుచరులు
- కోడ్ ఉన్నందున సాధారణ పాలనకే అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఎన్నికలు ముగిశాక ప్రధాన పార్టీలు అభ్యర్థులు ఇతర నగరాలకు వెళ్లిపోయారు. హైదరాబాద్, బెంగుళూరు వంటి సిటీల్లో ఉన్నారు. పోలింగు రోజు సాయంత్రం వరకూ ఉత్కంఠగా గడిపిన అభ్యర్థులు ఆ ప్రక్రియ ముగియగానే మరుసటి రోజునే చాలా మంది వెళ్లిపోయారు. ఇప్పుడు జిల్లాలో ఎవరూ కనిపించడం లేదు. నాలుగో తేదీ వరకూ ఇదే పరిస్థితి. లెక్కింపు రోజునే కనిపించేలా ఉన్నారు. కొందరు గుడులు, గోపురాల చుట్టూ తిరుగుతున్నారు. ఏదేమైనా అంతా విశ్రాంతి పేరుతో విహారయాత్రల్లో ఉన్నారు. ఈ కొద్దిరోజులైనా భార్యాపిల్లలతో హాయిగా గడుపుదామనే ఆలోచనతో అంతా జిల్లాకు సుదూరంగా ఉన్నారు. మరో రెండు వారాలు ఇదే పరిస్థితి తప్పదు. ఉత్కంఠగానే ఉన్నారు.

ఇక ఇక్కడున్న అభ్యర్థుల ప్రధాన అనుచరులు గణాంకాలు వేస్తున్నారు. వార్డుల వారీగా, గ్రామాలవారీగా తమకు వచ్చే ఓట్లపై అంచనాల్లో ఉన్నారు. గతంలో వచ్చిన మెజా ర్టీల ఆధారంగా ఇప్పుడు కొంత తగ్గించే లెక్కలు వేస్తున్నారు. గెలుపుపై ఎవరి ధీమాలో వాళ్లున్నారు. మెజార్టీలపై బెట్టింగులూ నడుస్తున్నాయి. పోటాపోటీ ఉన్న చోట్ల గెలుపుపై బెట్టింగ్ పెడుతున్నారు. ఏదో ఒక పార్టీకి గెలుపు ఖాయమన్న స్థానాలపై మెజార్టీలపైనే బెట్టింగులు నడుస్తున్నాయి. జిల్లాలో ఎవరికి ఎన్ని సీట్లు వస్తాయనే అంశాలపైనా పందేలు పెడుతున్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఈ తరహా వ్యవ హారాలు తెరపైకి వచ్చాయి. తాజాగా ఒంగోలు వైసిపి అభ్యర్థి బాలినేని శ్రీని వాసరెడ్డి అనుచరులు ఆయనకు వార్డుల వారీగా వచ్చే మెజార్టీని తేల్చారు. సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. 9 వేలకు పైగా మెజార్టీ వస్తుందని తేల్చారు. ఇలా అన్ని నియోజకవర్గాల్లోనూ అంచనాల్లో నేతలు న్నారు. గతంలో వచ్చిన మెజార్టీలు ఇప్పుడు కనిపించడం లేదు. వేసుకునే పరిస్థితి కూడా లేదు. ఎందుకంటే ఎవరికీ గెలుపుపై గట్టి ధీమా లేదు. నువ్వానేనా అన్నట్లుగానే కొన్ని చోట్ల పోలింగు జరిగింది. వాస్తవానికి అభ్యర్థులు పైకి గంభీరంగానే ఉన్నా.. లోపల మాత్రం ఉత్కంఠ తప్పడం లేదు. పోలింగు రోజునే పరిస్థితి ఏమిటన్నది సీనియర్ నేతలకు స్పష్టంగా తేలిపోయింది. ఏదేమైనా మరో రెండు వారాలు ఇదే ఉత్కంఠ తప్పదు. ఇక జిల్లాలో పోలింగ్ రోజున పెద్దగా గొడవలు లేవు. దర్శి, పుల్లలచెరువు మండలాల్లోనే ఘర్షణలు జరిగాయి. వాటిని వెంటనే పోలీసులు అదుపుచేశారు. ఈ విషయంలో కలె క్టర్, ఎస్పీ ఇద్దరూ పాలనాపరంగా ఎటువంటి చిక్కులు లేకుండా చూసుకున్నారు. అయితే పోలింగ్ అనంతరం గొడవలు జరిగే అవకాశా లున్నందున పోలీసుశాఖ అప్రమత్తంగానే ఉంది. ఘర్షణలకు దిగితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఒంగోలుతో పాటు పలుచోట్ల మాక్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ఘర్షణలకు దిగితే ఎలాంటి చర్యలు తీసుకుంటామనేది ప్రజలకు అర్ధమయ్యేలా ఈ ప్రయోగ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇక కోడ్ ▶ 2లో




మేదరమెట్లలో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఇసుక తవ్వకాలు జరిపితే కఠినచర్యలు

- సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి
- మైనింగ్ అధికారులకు కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశం

▲ 8లో



మాచవరంలో సాగుకు సిద్ధమైన రైతులు

సాగుకు సన్నద్ధం

- వర్షాలతో పదునెక్కిన భూములు
- నువ్వుల సాగు పట్ల రైతుల ఆసక్తి

▲ 5లో

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-గిద్దలూరు

స్థానిక శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో 1995-1998 విద్యా సంవత్సరంలో బీకాం డిగ్రీ కోర్సును పూర్తి చేసుకున్న నాటి విద్యార్థుల సమ్మేళనం పట్టణంలోని అభిలాష్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగింది. ఈ 25 సంవత్సరాలలో తాము సాధించిన విజయాలు, తమ జీవితాలలో ఎన్నెన్నో మలుపులు, ఎన్నో సంఘటనలు పంచుకున్నారు. తమ సంతోషాలను, ఆనందాలను, ఆపదలను, విషాదాలను అన్నింటినీ చెప్పుకున్నారు. ఎవరికి వారు తాము పెట్టుకున్న లక్ష్యాలను అధిగమించాలని, అందరి జీవితాల్లో సుఖ సంతోషాలు వెల్లివిరియాలని, నిజాయితీగా, ధర్మంగా జీవించాలని, తల్లిదండ్రులను గౌరవించాలని, కుటుంబాలను అభిమానించాలని, మానవత్వాలను చూపాలని అన్నారు. తమకు దూరమైన మిత్రుడు జి అశోక్‌కు సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తమకు విద్యాబోధన చేసిన నాటి అధ్యాపకులు పి స్వరూపారెడ్డి, రాఘవరావు, వి బాలిరెడ్డి, భాస్కరరావులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమములో పూర్వ విద్యార్థులు ప్రసాద్, మధు, పాండు, అనసూయ, నాగమణి, సాయిలక్ష్మీ, రంగేశ్వరి, కామేశ్వరరావు, ప్రసాద్, సత్యనారాయణ, శేఖర్, రాజేశ్వరి, నిర్మల దేవి తదితరులు పాల్గొన్నారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థుల బృంద చిత్రం

'వేట నిషేధ' భృతి కోసం..
ఎదురుచూపులు

(మొదటిపేజీ తరువాయి)

మత్స్యకారులకు నిషేధకాల భతిని మంజూరు చేసేందుకు ఫిష్ లాండింగ్ సెంటర్ల వారీగా వేట నిషేధకాల జాబితాను తయారు చేయాల్సి ఉంది. మత్స్యకార కుటుంబాల సర్వే కోసం ప్రత్యేక బృందాలను నియమిస్తారు. తనిఖీ బందం ల్యాండింగ్ సెంటర్లకు వచ్చి మత్స్యకారుల పడవలను తనిఖీ చేసి నిర్ధారిస్తారు. ఇందుకోసం పలు నిబంధనలు అమలు చేస్తున్నారు. వేట నిషేధకాల భతి పొందేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర సంక్షేమ పథకాలలో లబ్ధిదారుడు కాని మత్స్యకారుడు మాత్రమే అర్హులు. 300 యూనిట్లు లోపు మాత్రమే విద్యుత్ వినియోగం ఉండాలి. ఒక కుటుంబానికి ఒకరు మాత్రమే భృతికి అర్హులు. 18 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి, రూ.1.20 లక్షల లోపు ఆదాయం కలిగిన గ్రామీణులకు, రూ.1.44 లక్షల లోపు ఆదాయం కలిగిన పట్టణ ప్రాంత మత్స్యకారులు ఈ భృతికి అర్హులు. మత్స్యకారుల కుటుంబంలో ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నా, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు ఈ భృతి పొందేందుకు అనర్హులు. ఎన్నికల కోడ్ కారణంగా ఈ సారి అర్హుల జాబితా తయారులో జాప్యం జరిగింది. ఈ క్రమంలో వేట నిషేధకాలం ముగిసే లోపు అయినా మత్స్యకార భరోసా విడుదల చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిబంధనల కారణంగా గతంలో మత్స్యకారుల్లో అర్హులైన పలువురికి ప్రభుత్వ సాయం అందలేదని ఈ సారైనా సక్రమంగా పరిశీలన చేసి అర్హులైన వారందరికీ మత్స్యకార భరోసా అందేలా చూడాలని వారు కోరుతున్నారు.

విశ్రాంతిలో అభ్యర్థులు

(మొదటిపేజీ తరువాయి)

అమలులో ఉన్నందున సాధారణ పాలనకే అధికారులు పరిమితమయ్యారు. నిధులతో కూడిన ఎటువంటి పనులకూ అవకాశం లేదు. ఇతర సమస్యల పరిష్కారానికి ఇప్పుడు మార్గం కనిపించడం లేదు. ప్రస్తుతం వ్యవసాయసీజన్ మొదలైంది. దీనిపై చర్చించే పరిస్థితి కూడా లేదు. రైతులకు ఎరువులు, విత్తనాలు కావాల్సి ఉంది. వర్షాలు పడగానే ఖరీఫ్ సీజన్ మొదలవుతుంది. వ్యవసాయశాఖ దీనిపై కేంద్రీకరించాల్సి ఉంది. కొన్నిచోట్ల తాగునీటి సమస్య కూడా కొనసాగుతోంది. వర్షాలకు కొంత ఊరట కలిగింది.

టంగుటూరి స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

వారి వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. ఆంధ్ర కేసరి మునిమనుమడు టంగుటూరి సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఈ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్‌లోని ఉద్యోగులు పాల్గొన్నారు.

టంగుటూరి ప్రకాశం పంతులుకు నివాళి

ప్రజాశక్తి-త్రిపురాంతకం: త్రిపురాంతకంలోని శాఖా గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతి వేడుకలను గ్రంథపాలకుడు జి రామాంజినాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు జి రామాంజి నాయక్ మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం పంతులు భారత రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి, నిరుపేద కుటుంబంలో పుట్టి వారాలు చేసుకుంటూ చదువుకుని, ఆంధ్ర రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. 1940-50 దశాబ్దాలలో ఆంధ్ర రాజకీయాల్లో ప్రముఖంగా వెలుగొందిన వ్యక్తుల్లో ప్రకాశం పంతులు ఒకరని ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణాయక పాత్ర పోషించి, మద్రాసులో సైమన్ కమిషన్ వ్యతిరేక ప్రదర్శనలో తుపాకీ ఎదురుగా నిలబడి ఆంధ్రకేసరి అని పేరు పొందారని ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర కార్యదర్శి గొట్టిముక్కుల నాసరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ఆర్ఎంగా రఘురాం

ప్రజాశక్తి-మార్కాపురం: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్‌గా మహేశ్వరం రఘురాం సోమవారం తన కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. ఈయన కడప కేంద్ర కార్యాలయం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ రీజినల్ మేనేజర్‌గా పని చేస్తున్న శ్రీనివాస్ ప్రసాదు కడప జిల్లా రీజినల్ మేనేజర్‌గా బదిలీపై వెళ్లారు. నూతన ఆర్ఎంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా రఘురాం మాట్లాడుతూ ఏపీజీబీ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తమ సిబ్బంది శక్తి వంచన లేకుండా కృషి చేస్తారని తెలిపారు. ముఖ్యంగా తమ బ్యాంకు శాఖలు గ్రామీణ ప్రాంతాలలో చిన్న సన్న కారు రైతులకు, చిరు వ్యాపారులకు, సామాన్య పేద రైతులకు బాసటగా నిలుస్తూ రుణాలను మంజూరు చేస్తాయని అన్నారు. నూతన రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలను చేపట్టిన సందర్భంగా మహేశ్వరం రఘురాంకు కార్యాలయం సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న రఘురాం

రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సమావేశం

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండల వ్యవసాయ కార్యాలయంలో గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి బాలాజీ నాయక్ ఆధ్వర్యంలో గిద్దలూరు మండల రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 2023-24 రబీ సీజన్ లోటు వర్షపాతం వలన కరువు మండలంగా ప్రకటించారని, మండలంలో రబీ సీజన్లో వేసిన పంటలు 33శాతం కన్నా అధికంగా నష్టపోయిన పంటల వివరాలు ప్రొఫార్మా తయారు చేసి మే 24వ తేదీ లోపు గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించాలని ఆర్‌బికె సిబ్బందికి ఏడిఏ సూచించారు. మండల వ్యవసాయాధికారి వై విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పప్పు శనగ, మినుములు, జొన్న, వరిగ, నువ్వులు, ఉలవలు, ఆముదం మొదలైన పంటలు 33శాతం కన్నా అధికంగా నష్టపోయినట్లు తెలిపారు. కాబట్టి వాటికి సంబంధించిన రైతుల వివరాలు, ఆధార్, బ్యాంకు వివరాలతో నివేదిక తయారు చేసి సామాజిక తనిఖీ అనంతరం మే 29వ తేదీ లోపు జిల్లా వ్యవసాయ కార్యాలయానికి జాబితా పంపాల్సి ఉంటుందని తెలిపారు.

శాంతి భద్రతలు కాపాడాలి

ప్రజాశక్తి-గిద్దలూరు

ఎన్నికల ఫలితాల తరువాత గ్రామాల్లో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు అన్ని పార్టీల రాజకీయ నాయకులు కృషి చేయాలని గిద్దలూరు అర్బన్ సిఐ సోమయ్య అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ నాయకులు ఎన్నికల ఫలితాల తర్వాత గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలని, అలాగే గ్రామాల్లో శాంతి భద్రతలు నెలకొల్పేందుకు అన్ని రకాల పార్టీ రాజకీయ నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పోయినవి

నేను గృహిణిని. నేను రిజిస్టర్డ్ డీడ్ల ద్వారా ఆస్తిని కొనుగోలు చేసాను. రిజిస్ట్రేషన్ నెంబర్ 2838 Dt 1984, హైదరాబాద్ రంగారెడ్డికి చెందిన S.తిమ్మారెడ్డి నుండి సబ్ రిజిస్ట్రా ఆఫీస్ రిజిస్టరింగ్ అథారిటీ వద్ద ఆస్తికి సంబంధించి నాకు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ జారీ చేసినది, తదనంతరం, నా వద్ద ఉన్న నాతల్లిగారు మరణించినారు. అయితే సదరు డాక్యుమెంట్లను ఫోటో స్టాట్ కాపీల కోసం ది:15-05-2024న నా ఇంటి నుండి మోటార్ సైకిల్‌పై ఇంకొల్లు బస్టాండ్‌కు వెళుతుండగా, రిజిస్ట్రేషన్ డీడ్ నెంబర్: 2838/1984 మరియు ఇతర డాక్యుమెంట్లను ఉన్న నా బ్యాగు పోయినది. అనంతరం ఎంత వెతికినను కనిపించలేదు దీనిపై ఇంకొల్లు పోలీసు వారికి కూడా ఫిర్యాదు చేయడం జరిగింది కావున సదరు డాక్యుమెంట్లు ఎవరికైనా దొరికిన యెడల ఇంకొల్లు పోలీసు వారికి గాని క్రింది నా చిరునామాకు గాని చేర్చవలసినదిగా ప్రార్థన.

ఇట్లు
దేసు కన్యాకుమారి
W/o late కోటి స్వామి
ఇంకొల్లు మండలం,బాపట్ల జిల్లా.

ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పోయినవి

నేను పెట్రోల్ బంక్ వ్యాపారం చేస్తున్నాను. నేను హైదరాబాదు ,రంగారెడ్డి జిల్లా కి చెందిన ఎస్.తిమ్మారెడ్డి నుండి రిజిస్ట్రేషన్ నెంబర్ 2834 Dt:1984లో రిజిస్ట్రేషన్ డీడ్స్ ద్వారా ఆస్తిని కొనుగోలు చేసాను, రిజిస్టర్ అథారిటీ సబ్ రిజిస్టరింగ్ ఆఫీస్‌లో, నాతల్లి చనిపోయినట్లు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ జారీచేసింది. నేను పై డాక్యుమెంట్లను ఫోటో స్టాట్ కాపీల కోసం ది 15-05-2024న నా ఇంటి నుండి ఇంకొల్లు బస్టాండ్‌కి నా మోటార్ సైకిల్‌పై వెళు తుండగా, రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు 2834/1984 మరియు ఇతర డాక్యుమెంట్లు ఉన్న బ్యాగ్ పోయినది. ఎంత వెతికినను కనిపించలేదు .దీనిపై ఇంకొల్లు పోలీసు వారికి కూడా ఫిర్యాదు చేయడం జరిగింది. ఎవరికైనా నువ్వు దొరికిన యెడల సదరు డాక్యుమెంట్లను ఇంకొల్లు పోలీసు వారికి గాని క్రింది నా చిరునామాకు గాని చేర్చవలసినదిగా ప్రార్థన.

ఇట్లు
బెల్లంకొండ వాసుదేవరావు
S/o late సుబ్బారాయుడు
ఇంకొల్లు మండలం, బాపట్ల జిల్లా.

మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E P.NO. 6/2018
OS NO.775/2014

మధ్య
కేతినేని లక్ష్మీప్రసన్నదేవి..పిటిషనర్ /డిక్రీ హోల్డర్
వర్సెస్
దగ్గుపాటి వెంకటేశ్వర్లు మరియు ఇతరులు ...ప్రతివారులు

To
దగ్గుపాటి గోవర్ధన్, తండ్రి : (లేట్) వెంకటేశ్వర్లు, వయస్సు : 35 సం.లు, హిందు, అడ్రసు: బిసి కాలనీ, పెర్వమిట్ట గ్రామం, సంతనూతలపాడు గ్రామం,ప్రకాశం జిల్లా

పై నెంబరు కేసులో పిటిషనరు అయిన కేతినేని లక్ష్మీ ప్రసన్న దేవి గారు ప్రతివాది అయిన దగ్గుపాటి గోవర్ధన్ గారు, తన తండ్రి దగ్గుపాటి. వెంకటేశ్వర్లు చనిపోయినందున అతని వారసులుగా గుర్తించి సదరు ఇపిలో జప్తు చేయించినటువంటి దగ్గుపాటి వెంకటేశ్వర్లు ఆస్తులను వేలం వేసి డిక్రీ హోల్డరు కు చెల్లించవలసిన మొత్తం రికవరీ చేయుటకు దాఖలు చేయబడిన పై నెంబరు కేసును తేది: 19-06-2024నకు వాయిదా వేయడ మైనది. కావున మీరు స్వతహాగా గాని సంపూర్ణంగా సంజాయిషి పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తరములు చెప్పగూడిన ఏదోఒక మనిషి ద్వారా కానీ సదరు దావాకు ప్రతి ఉత్తరము చెప్పగలందులకు 19-06-2024 న ఉదయం 10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ సమాధానాన్ని దాఖలు పరచవలెయను. పై చెప్పబడ్డ దినమునందు నీవు హాజరు కాకుండా తప్పిపోయిన యెడల మీ పరోక్ష మందు సదరు వాజ్యమును విమర్శించి తీర్మానించ బడుననీ మీరు తెలుసుకోవలసినది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు
తేది 19-06-2024

ఇట్లు
కరేటి శ్రీనివాసులు
అడ్వకేట్, ఒంగోలు

పార్టిషన్ దస్తావేజులు పోయినవి

బాపట్ల జిల్లా, జె.పంగులూరు మండలం, ముప్పవరం గ్రామానికి చెందిన ఇంటూరి సుబ్బారావు గారి కుమారుడు పూర్ణచంద్రరావు కి సంబంధించిన ముప్పవరం గ్రామ ఆస్తులకు సంబంధించిన పార్టిషన్ దస్తావేజులు పోయినవి. దస్తావేజు నెంబర్ 3631/2010. జూలై 29, 2010 సంవత్సరమున మార్టూరు సబ్ రిజిస్టర్ కార్యాలయం లో రిజిస్టర్ జరిగింది. 15/5/2024న ముప్పవరం నుండి మార్టూరు కు ఆటోలో వస్తుండగా దస్తావేజులు ఉన్న బ్యాగు పోయినది. కావున ఎవరికైనా దొరికినచో దిగువ చిరునామాకు తెలియజేయగలరు.

ఇట్లు
ఇంటూరి పూర్ణచంద్రరావు
తండ్రి సుబ్బారావు
జె.పంగులూరు (మం)
ముప్పవరం (గ్రామం), బాపట్ల జిల్లా
సెల్ : 9948410155

ఒరిజినల్ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పోయినవి

నేను పెట్రోల్ బంక్ వ్యాపారం చేస్తున్నాను. మా అమ్మ జీవించి ఉన్నప్పుడే, మా అమ్మ నాకు రిజిస్ట్రేషను సర్టిఫికేట్ జారీ చేసిన సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ వద్ద హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాకి చెందిన ఎస్.తిమ్మారెడ్డి నుండి రిజిస్టర్ డీడ్ నెం: 2828, 3153,2829 dt:1984 ద్వారా ఆస్తిని కొనుగోలు చేసింది. తదనంతరం, నా వద్ద ఉన్న నా తల్లి గారు మరణించినారు .నేను సదరు డాక్యు మెంట్లను ఫోటో స్టాట్ కాపీల కోసం ది 15-05-2024న నా మోటార్ సైకిల్‌పై నా ఇంటి నుండి ఇంకొల్లు బస్ స్టాండ్‌కు వెళు తుండగా, రిజిస్ట్రేషన్ డీడ్ల సంఖ్య: 2828/1984, 3153/1984, 2829/ 1984 డాక్యుమెంట్ లు ఇతర పత్రాలు ఉన్న బ్యాగ్ పోయినది దీనిపై అనంతరం ఎంత వెతికినన్ కనిపించలేదు దీనిపై ఇంకొల్లు పోలీస్ వారికి కూడా ఫిర్యాదు చేయడం జరిగినది. పై డాక్యుమెంట్లు ఎవరికైనను దొరికిన యెడల ఇంకొల్లు పోలీసు వారికి గాని ,క్రింది నా చిరునామాకు గాని చేర్చవలసినదిగా ప్రార్థన.

ఇట్లు
బెల్లంకొండ వాసుదేవరావు
S/o late సుబ్బారాయుడు
ఇంకొల్లు మండలం, బాపట్ల జిల్లా.

IN THE COURT OF THE HON'BLE VIII ADDITIONAL DISTRICT JUDGE CUM FAMILY COURT:: ONGOLE, PRAKASAM DISTRICT
Crl.M.P. 410/2024
IN
M.C. NO.37/2023.

మాదిగనేని క్యాని .....పిటీషనరు.
వర్సెస్
జంగం వంశీకుమార్ ...రెస్పాండెంట్.

To
జంగం వంశీకుమార్
తండ్రి నాగేశ్వరరావు అలియాస్ శ్రీనివాసరావు, ఇంటినెం. 23-1-223, ప్రగతి కాలనీ, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
ఉద్యోగము :అసిస్టెంట్ మేనేజరు, కెనారా బ్యాంకు, కలుజువ్వలపాడు, తర్లుపాడు మండలం, ప్రకాశం జిల్లా.

నోటీసు

పై నెంబరు పిటీషనులో పిటీషనరు, రెస్పాండెంటు అయిన నీ పై మెయింటెనెన్స్ కోరుచూ పిటీషను దాఖలు చేయగా, నోటీసు నిమిత్తము నీకు కోర్టు నుంచి ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించి ననూ, జారీకానందున పెకోర్టు వారు నీకు పేపరు ప్రకటన ద్వారా జారీ చేయించుమని Crl.M.P. 410/ 2024 తేది : 07-05-2024 ద్వారా ఉత్తర్వులు ఇచ్చినందున నీకు నోటీసు నిమిత్తం తేది. 02-07-2024కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉదయం.10-30 ని.లకు నీవు స్వయంగా కాని, అడ్వకేటు ద్వారా కాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయి ఆక్షేపణలు తెలుపుకొన వలసినది లేని యెడల ఆరోజు నీ పరోక్షమునందు విచారించి విడాకులు మంజూరు చేయుటకు తీర్మానించబడును ఇందు మూలంగా తెలియజేయడమైనది.

// కోర్టువారి అనుమతితో //

ఒంగోలు
తేది : 20-05-2024

ఇట్లు
షేక్ అబ్దుల్ నబీ
బందారు ధనలక్ష్మి
పిటీషనర్ తరుపు న్యాయవాదులు,
జిల్లాకోర్టు ఎదురు, ఒంగోలు,
సెల్ నెంబర్.9441444115.

ప్రజాశక్తి
మంగళవారం 21 మే 2024

గ్రామాల్లో కార్డెన్ సెర్చ్



శింగరాయకొండలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం మూలగుంట పాడు గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ శ్రీరామ్ ఆధ్వర్యంలో పోలీసులు కాలనీలోని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పత్రాలు లేని 16 వాహనాలను గుర్తించి వాటిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. గతంలో ఈ కాలనీలో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో పోలీసులు కాలనీలో జల్లెడ పట్టారు. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కాలనీలో ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి : మర్రిపూడి మండలం జువ్విగుంట గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు, నంబర్లు ప్లేట్లు లేని 20 బైకులను స్వాధీనం చేసుకున్నట్లు కొండపి సర్కిల్ సిఐ వై.పాండురంగారావు తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు దానికి సంబంధించిన పత్రాలు సరిగా ఉన్నాయా లేదా అని చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొండపి ఎస్ఐ కృష్ణబాజి, పొన్నలూరు ఎస్ఐ రాజేష్, మర్రిపూడి ఎస్ఐ శివబసవరాజు , మూడు మండలాల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు : మండల కేంద్రమైన నాగులుప్పలపాడులో ఎస్ఐ బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు లేని 19 బైకులు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిఎస్.పురం : గ్రామాల్లో ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పామూరు సిఐ రామ్‌నాయక్ తెలిపారు. సిఎస్.పురంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా ఉండాలన్నారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వారిపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులుకనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ ప్రేమ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన కమిటీకి సన్మానం



నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-దర్శి

ఎపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికైన కెవిజి.కీర్తి మరియు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన బి.వెంకటరావును ఎపిటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ కీర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఉపాధ్యాయుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. జిల్లా అధ్యక్షుడు బి.వెంకటరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఎలాంటి సమస్యలు ఉన్న జిల్లా పరిధిలో రాష్ట్ర పరిధిలో పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వి.బాలాజీరావు, ఏ.గురవయ్య, కె.నాగరాజు, మండల శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ఏ.గురులింగం, కె.వెంకటేశ్వర్లు, మండల శాఖ ప్రధాన కార్యదర్శి బుర్రి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఎం.సాంబయ్య, ఎం. సుబ్బారావు, కె.చెంచయ్య, డి.తిరుపతి స్వాములు, రాజశేఖర్, మీనిగ శ్రీను, ఎ.ఏడుకొండలు, ఈర్ల రోశయ్య, రామారావు, ఇట్లా వెంకటేశ్వర్లు, కె.రామారావు, రోశయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

కనిగిరిలో పోలీసుల మాక్ డ్రిల్



మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి- కనిగిరి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో కనిగిరి పట్టణంలోని పామూరు బస్టాండ్, చర్చి సెంటర్లో అడిషనల్ ఎస్‌పి అశోక్ బాబు, డిఎస్‌పి రామరాజు ఆధ్వర్యంలో పోలీసులు మాక్ ఆపరేషన్, మాక్ డ్రిల్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక బలగాలతో వాస్తవికతకు దగ్గరగా ఉండేలా ప్రజలను చైతన్య వంతులు చేసేలా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అల్లర్లు జరిగినప్పుడు వాటిని ఏ విధంగా ఎదుర్కొంటారు నివారిస్తారు కళ్లకు కట్టినట్లుగా ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. అనంతరం అడిషనల్ ఎస్‌పి అశోక్ బాబు, డిఎస్‌పి రామరాజు మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు , హింసాత్మక ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి అల్లర్లకు అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా ప్రత్యేక పోలీసు బందాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ త్యాగరాజు, అగ్నిమాపక కేంద్రం అధికారి రామకష్ణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి ధరలు పతనం



మిర్చి గ్రేడింగ్ చేస్తున్న మహిళ

ప్రజాశక్తి-దర్శి

ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి పంటకు ధరలు లేక పోవడంతో రైతులు అల్లాడుతున్నారు. గతంలో మిర్చి ధర టన్ను రూ.20 వేలు పలికింది. ప్రస్తుతం రూ.12 వేలకు పడిపోయింది. వ్యాపారులు సిండికేట్ అయి ధరలు తగ్గించినట్లు రైతులు చెబుతున్నారు. సాగర్ నీరు ఆలస్యంగా రావడంతో దర్శి ప్రాంతంలోని ఆగస్టు, సెప్టెంబర్‌లో మిర్చి పంటను సాగు చేశారు. సాగర్ కుడి కాలువ జోన్ పరిధిలోని 4.30 ఎకరాల ఆయకట్టు ఉంది. రెండు లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. మిగతా పొలంలో మిర్చి, పొగాకు, పత్తి లాంటి ఆరుతడి పంటలు సాగు చేస్తారు. ఈ ఏడాది సాగు నీరు ఇవ్వకపోవడంతో కొంత మంది ఎక్కువ మంది రైతులు మిర్చి పంట సాగు చేశారు. అయితే దిగుబడి బాగా వచ్చినప్పటికీ ధరలు లేక పోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

మూడు ఎకరాల్లో మిర్చి సాగు చేశా...

పేరం పరంధామిరెడ్డి, రైతు, రెడ్డినగర్

మూడు ఎకరాల మిర్చి పంటను సాగు చేశా. తుఫాను కారణంగా పంట దెబ్బతింది. సుమారు ఎకరా విస్తీర్ణంలోని మిర్చి మొక్కలను పీకేశాం, మూడు ఎకరాలకు కలిపి సుమారు రూ.4 లక్షల పెట్టుబడి పెట్టా. 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొదట్లో మిర్చి టన్ను రూ.20 వేల వంతున అమ్ముడు పోయాయి. తర్వాత రూ.17 వేల వంతున కొనుగోలు చేశారు. ప్రస్తుతం రూ.12 వేలకు మించి అమ్ముడు పోవడం లేదు. ధరలు తగ్గడంతో మిర్చి విక్రయించలేదు. క్వింటా రూ.20 వేల లెక్కన అమ్ముడు పోతేనే పెట్టుబడి అయినా వస్తుంది. లేకుంటే నష్టాలు తప్పవు. కాయలు కోసే కూలీలకు రోజుకు రూ.300, మిర్చి గ్రేడింగ్ చేయడానికి రోజుకు రూ.300 వంతున కూలీ చెల్లించాల్సి వస్తుంది. కూలీ రేట్లు పెరగడం, ధరలు పడిపోవడంతో రైతులకు నష్టాలు తప్పేలా లేదు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

గిద్దలూరు రూరల్ : అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సిఐ కొండారెడ్డి తెలిపారు. సెబ్ సిఐ కథనం ప్రకారం... గిద్దలూరు నియోజక పరిధిలోని రాచర్ల గ్రామానికి చెందిన కోటేశ్వరరావు అనే వ్యక్తి 13 డిఫెన్స్ మద్యం బాటిళ్లను బైకుపై తరలిస్తు న్నాడు. అందిన సమాచారం మేరకు సెబ్ పోలీసులు దాడి చేసి కోటేశ్వరరావు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 13 మద్యం బాటిళ్లు, బైకును స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సెబ్ అధికారులు మాధవరావు, రిజ్వాన్, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

కొండపి : ఉపాధి కూలీలకు రోజువారీ వేతనం రూ.300 గిట్టు బాటయ్యేలా చేయాలని ఒంగోలు క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ పాలేటి వెంకటస్వామి తెలిపారు. మండల పరిధిలోని అనకర్లపూడి, కట్టుబడిపాలెం గ్రామాలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను వెంకటస్వామి సోమవారం పరిశీలించారు. తొలుత కట్టుబడి వారిపాలెంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులు, పని ప్రదేశంలో ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకట స్వామి మాట్లాడుతూ ప్రతి కూలీకి రోజువారీ వేతనం రూ.300 తక్కువ కాకుండా, కొలతలు ప్రకారం పని చేయించి వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ మహాలక్ష్మి, ఇసి ప్రసాద్ , టిఎలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన వసతి

దర్శి : స్థానిక అంబేద్కర్ గురుకుల బాలుర కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి సీట్ల భర్తీ కోసం రెండో విడత కౌన్సిలింగ్ సోమవారం నిర్వహించారు. కౌన్సిలింగ్‌కు వచ్చిన విద్యార్థులకు మరియు వారి తల్లిదండ్రులకు లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ తరుపున భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ గురుకుల పాఠశాలల జిల్లా కో-ఆర్డినేటర్ జయ, దర్శి గురుకుల కళాశాల ప్రిన్సిపల్ మాధవరావు, లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ప్రెసిడెంట్ తమ్మవరపు ఫణిబాబు, సెక్రటరీ పానుగంటి సత్యనారాయణ గుప్త, అడిషనల్ క్యాబినెట్ జిల్లా సెక్రటరీ కల్లూరి విద్యాసాగర్‌రెడ్డి, క్లబ్ గైడింగ్ లయన్ బూదాటి ఆంజనేయులు, క్లబ్ సభ్యులు అంబటి గోవిందరెడ్డి, గుడిపల్లి శ్రీధర్‌బాబు, దొంగరి రమేష్, గువ్వల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులను గుర్తించాలి

చీమకుర్తి : స్థానిక ఎంఆర్‌సిలోని విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను జిల్లా సంహిత విద్యా ఇన్‌ఛార్జి కోఆర్డినేటర్ రమేష్ సోమవారం పరిశీలించారు. మండల పరిధిలోని జిఎల్‌పురంలో ఎంఇఒ శివాజీ, సిఆర్‌పిలతో కలిసి ప్రత్యేక అవసరాల కలిగిన విద్యార్థుల గుర్తింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులను గుర్తించి, వారి పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. 40 రోజుల పాటు భవిత కేంద్రాలలో విద్యార్థుల వివరాలను నమోదు చేయాలన్నారు. నమోదు ప్రక్రియను మండల విద్యాశాఖాధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ కె.శివాజీ, సిఆర్‌పి మాలకొండయ్య, ఎంఐఎస్ కోర్డినేటర్ ప్రసాద్ పాల్గొన్నారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

దర్శి : బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని తాళ్లూరు ఎంఇఒ ఇ.సుబ్బయ్య తెలిపారు. తాళ్లూరు పాముల కాలనీలో బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరుతూ దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ప్రతినిధి దార్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యా చైతన్య ప్రచార ఉద్యమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అందాలంటే తల్లిదండ్రులను తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులను పాఠశాలలు చేర్పించేందుకు వారి తల్లి దండ్రులను ఒప్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విజన్ సెంటర్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎపి ఇఐపిసెట్‌కు హాజరైన విద్యార్థులు

ఎపిఇఎపిసెట్ పరీక్షకు 486 మంది హాజరు

ప్రజాశక్తి - వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎపిఇఎపిసెట్ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షకు సోమవారం 486 మంది హాజరైనట్లు కళాశాల సెక్రటరి వనమా రామకృష్ణారావు తెలిపారు. ఎపి ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో కాకినాడ జెఎన్‌టియు పర్యవేక్షణలో ఈనెల 16నుండి 23వరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 250మందికి 241 మంది, సాయంత్రం 250మందికి 245మంది కలిపి 500మందికి 486మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు.



చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్న గ్రంధపాలకులు

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ఐదో రోజు సోమవారం నిర్వహించారు. గ్రంథ పాలకుడు సుగుణరావు ఆధ్వర్యంలో ఆంధ్రకేంద్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకాశం పంతులు జీవిత చరిత్ర గురించి ప్రకాశం ఎయిడెడ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మోహన్ విద్యార్థులకు తెలిపారు. డ్రాయింగ్ మాస్టర్ కత్తి బాల కోటేశ్వరరావు విద్యార్థినీ, విద్యార్థులకు డ్రాయింగ్‌పై అవగాహన కల్పించారు. డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



చెత్త, మట్టి తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

కాల్వల్లో చెత్త, మట్టి తొలగింపు

ప్రజాశక్తి - బాపట్ల

గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు పట్టణంలో మురుగు కాల్వల్లో చెత్త పేరుకుపోయింది. దీంతో మురుగు నీటి ప్రవాహానికి అవరోధం కలుగుతుంది. స్థానిక ఏజీ కాలేజి రోడ్డులో కుడివైపు మురుగు కాలువలో చెత్త, మట్టి తొలగింపు పనులను శానిటరీ ఇన్స్‌పెక్టర్ నజీర్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. వర్షాల కారణంగా ఇటీవల నిర్మించిన బిటి రోడ్డుపై వర్షపు నీరు డ్రైనేజ్ కాలువలోకి ప్రవహించకుండా నిలిచిపోయింది. రోడ్డు మీద ప్రవహించడంతోపాటు మురుగు కాలువల్లో పేరుకు పోయిన చెత్త, చెదారం రోడ్డు మీదకు చేరింది. దీంతో పరిశు ద్య సిబ్బంది రంగంలోకి దిగి కాలువలను శుభ్రపర్చే పనులు చేపట్టారు. పట్టణంలో వన్ వే రోడ్డు, కూరగాయల మార్కెట్, మరికొన్ని ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉంది. సైడ్ కాల్వలను పారిశుద్ధ్య సిబ్బంది గ్యాంగ్ వర్క్‌తో శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు.

అకాల వర్షంతో కరిగిన ఇటుకలు

- లక్షల్లో నష్టపోయిన బట్టీ యజమానులు
- నిర్మాణ రంగం సంక్షోభంతో కదలని బట్టీలు
- కళ్లముందు గుట్టలుగా లక్షల పెట్టుబడులు
- ముడిసరుకుపై రాయితీ కోరుతున్న యజమానులు

ప్రజాశక్తి - అద్దంకి

ఇటీవల కురిసిన వర్షాలకు అద్దంకి బంగారంగా పిలవబడే ఇటుక బట్టీల పరిశ్రమ అతలా కుతలమైంది. ఎప్పుడు లేని విధంగా ఈ ఏడాది మే నెలలో అకాల వర్షంతో పచ్చి ఇటుక మొత్తం కల్లాలపైనే నానిపోయి. అకాల వర్షం ఇటుక బట్టీల యాజమాన్యానికి అపార నష్టం కలిగించింది. అద్దంకి ప్రాంతంలో ఇటుక బట్టీల పరిశ్రమలో అనేక మంది ఉపాధి పొందుతున్నారు. గతంలో 150 ఇటుక బట్టీలు ఉండేవి. తిమ్మాయిపాలెం, పార్వతీ పురం, కలవకూరు రోడ్డు ప్రాంతాల్లో అద్దంకి పరిసర ప్రాంత వాసులు బట్టీలు ఏర్పాటు చేశారు. గత ఐదేళ్లుగా నిర్మాణ రంగం దెబ్బతినింది. దీని ప్రభావం ఇటుక పరిశ్రమపై పడింది. ఇటుక పరిశ్రమలో నష్టాలు రావడంతో ఇటుక బట్టి నిర్వాహకులు తగ్గుతూ వచ్చారు. ఇటుక తయారీకి కూలీలు దొరకకపోవడం, బట్టీలకు ఉపయోగించే మట్టి, బొగ్గు, పొట్టు, కర్ర వంటి ముడి పదార్థాల ధరలు పెరగ డంతో తయారీ ఖర్చు పెరిగింది. అదే స్థాయిలో ఇటుక ధరలు కూడా పెరిగాయి. అద్దంకి ప్రాంతంలో ఇటుక బట్టీల నిర్వాహకులు ఇటుక తయారీని పరిమితం చేసుకుం టూ వచ్చారు. ఈ ఏడాది ఇటుక బట్టిల పరిశ్రమ అంతంత మాత్రంగానే ఉంది. తయారు చేసిన ఇటుకను కూడా కొనుగోలు చేసేవారు లేక బట్టీల వద్దనే మిగిలి పోయింది. దీంతో పెట్టుబడి నిలిచిపోయి రాబడి లేకపోవడంతో యాజమాన్యంకు ఆర్థిక భారమైంది. పెద్ద మొత్తంలో పెట్టిన పెట్టుబడి ఇటుకల రూపంలో బట్టీలవద్దనే నిలిచిపోయింది. పెట్టిన పెట్టుబడికి వడ్డీలు పెరుగుతున్నాయి.

అకాల వర్షంతో భారీగా నష్టం

ఇటీవల అకాల వర్షానికి ఇటుక బట్టీల పరిశ్రమ నిర్వాహకులు ఆర్థికంగా రూ.లక్షలు నష్టపోయారు. వారం రోజుల క్రిందట అర్ధరాత్రి అకాల వర్షం కారణంగా కల్లాలపై ఉన్న పచ్చి ఇటుక అంతా నానిపోయింది. పచ్చి ఇటుక మొత్తం కరిగి కుప్పకూలిపోయాయి. ఒక పచ్చిఇటుక తయారికి రూ.7వరకు ఖర్చవుతుందని నిర్వాహలు చెబుతున్నారు. దానికి కాల్చు ఖర్చు అదనంగా అవుతుంది.



వర్షానికి నానిపోయి ఇటుక కళ్ళములో పడిపోయి దృశ్యాలు

అంతకన్నా ఎక్కువ ధరకు అమ్మగలిగితేనే పెట్టిన పెట్టుబడులు చేతికి వస్తాయి. ఇటుక బట్టీల నిర్వాహకులకు ప్రభుత్వం ఆర్థికంగా సహకారించాల్సిన అవసరం ఉంది. ఇటుక పరిశ్రమకు ఉపయోగించే ముడి సరుకు బొగ్గు, పొట్టుతో పాటు టార్పాలిన్‌లను సబ్సిడీపై అందిస్తేనే ఇటుక బట్టీ యాజమానులు నిదొక్కుకొనే అవకాశం ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది బొగ్గు టన్ను ధర రెట్టింపు అయ్యింది.

ఒక్కొక్క బట్టీలో 150 మందికి ఉపాధి

ఇటుకల వ్యాపారం బాగుంటే ఒక్కొక్క బట్టీలో 100నుండి 150మందికి పని దొరుకుతుంది. ఈ ప్రాంతంలో ఇతర పరిశ్రమలు ఏమీ లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇటుక బట్టీలు ఉపాధి వనరుగా మారింది. ఇటీవల అనేకమంది పనుల కోసం పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, తెలంగాణకు రోజువారి పనులకు యువత, కూలీలు తరలి వెళ్లారు. గతంలో ఇక్కడి వాళ్లతోపాటు ఇటుక బట్టీల వద్ద పనిచేసేందుకు పొరుగు రాష్ట్రాల నుండి కూలీలు వచ్చేవాళ్లు. స్థానిక భవానీ సెంటర్లో ఆదివారం వస్తే గతంలో వందల మంది కూలీలు నిత్యవసర సరుకుల కోసం వచ్చే వాళ్లు. దీంతో పట్నంలో వ్యాపారం బాగానే ఉండేది.

హైదరాబాదులో అద్దంకి ఇటుకకు గిరాకీ

హైదరాబాద్‌తో పాటు, శ్రీశైలం, నెల్లూరు, గుంటూరు, కృష్ణాజిల్లాలో కూడా అద్దంకి నుండి ఇటుక సరఫరా జరిగేది. హైదరాబాదులో అద్దంకి ఇటుకల బోర్డులు పెట్టి మరీ అమ్మేవాళ్లు. ప్రస్తుతం అలాంటి పేరు, ప్రతిష్టలే అంద్దంకి ఇటుకల బట్టీలను బ్రతికిస్తున్నాయి. రాష్ట్రంలో మళ్లీ నిర్మాణ రంగం జీవం పోసుకుంటేనే ఇటుక పరిశ్రమకు మనుగడ సాధ్యం.

ఓట్ల లెక్కింపునకు పటిష్ట భద్రత

- లాడ్జిలు, హెూటల్లో ఆకస్మిక తనిఖీలు
- కొత్త వ్యక్తులపై పోలీసుల ప్రత్యేక నిఘా

ప్రజాశక్తి - చీరాల

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు పటిష్ట బద్రత చర్యలు తీసుకుంటు న్నామని ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా మే 19న ఆదివారం రాత్రి లాడ్జీలు, హెూటళ్లు, రిసార్ట్స్‌లో పోలీసు అదికారులు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. వాటిలో పనిచేసే సిబ్బందికి సూచనలు చేశారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందులో భాగంగానే నియోజకవర్గంలోని లాడ్జిలు, రిసార్ట్స్, హెూటళ్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు, తరచూ ఘర్షణలు పడే వ్యక్తులు, పాత నేరస్తులు ఉన్నారేమోనని పరిశీలించినట్లు తెలిపారు. లాడ్జీలు, రిసార్ట్స్, కళ్యాణ మండపాల నిర్వాహకులు, యజమానులు అనుమానితులకు ఆశ్రయం కల్పించకూడదని సూచించారు. ఎవరైనా పాత నేరస్తులు, అవాంఛనీయ ఘటనలకు పాల్పడే అవకాశం వున్న వారు, అనుమానితులు ఉంటే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు అనుమానాస్పదంగా గాని, గుంపులుగా గాని సంచరిస్తుంటే వెంటనే 100, 112కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో సిఐలు శేషగిరిరావు, సోమశేఖర్, నిమ్మగడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు.



లాడ్జిల్లో తనిఖీ చేస్తున్న సిఐ శేషగిరిరావు

మానవ హక్కుల కౌన్సిల్ సభ్యులుగా సురేష్

ప్రజాశక్తి - భట్టిప్రోలు

హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్స్ నేషనల్ సభ్యునిగా నంది అవార్డు గ్రహీత యన్నం సురేష్‌కు సోమవారం రేపల్లె కార్యాలయంలో నేషనల్ కోఆర్డినేటర్ పిన్ని సాంబశివరావు చేతుల మీదగా సభ్యత్వం అందుకున్నారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ 1948 డిసెంబర్ 10న హెూమం రైట్స్ ప్రొటక్షన్ కౌన్సిల్ ఆఫ్ పీపుల్స్ ప్రారంభించినట్లు తెలిపారు. అనేక హక్కులు మానవుడు జీవించేందుకు కల్పించినట్లు తెలిపారు. వీటిని పరిరక్షించేందుకే కౌన్సిల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి పరిరక్షణకు గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం కర్నూలులో మానవ హక్కుల కోర్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఎన్ చంద్రశేఖర్ బాబు, నాగేశ్వరరావు, సుమంత్, ప్రభాకర్, చిట్టిబాబు పాల్గొన్నారు.



హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సభ్యులతో సురేష్



శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్న కావూరి రఘుచంద్

జెవివి వేసవి శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల్లో జెవివి ఆధ్వర్యంలో ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు వేసవి శిక్షణ శిభిరం సోమవారం ప్రారంభించారు. శిభిరంకు 25మంది విద్యార్థులు హాజరయ్యారు. జన విజ్ఞాన వేదిక, ఆరోగ్య సబ్ కమిటీ కన్వీనర్, హెూమియోపతి వైద్యులు కావూరి రఘుచంద్ శిక్షణను ప్రారంభిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, విద్యార్థులు మూఢనమ్మకాలు విడనాడి, శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని అన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకొని వ్యాధుల నుండి రక్షణ పొందాలని సూచించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు మన్నం త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యమైన సందర్భానికి గుర్తుగా కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. అప్పుడే ఈ భూమిని భూ తాపం నుండి రక్షించగలమని అన్నారు. అనంతరం ఫన్ మాథ్స్ క్లాస్‌ను తంగా శ్రీనివాసరావు, ఇంగ్లీష్ గ్రామర్ బేసిక్స్ కావూరి ధనలక్ష్మి బోధించారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.



సిరివెన్నెల చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నిర్వాహకులు

'సిరివెన్నెల'కు ఘన నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

తెలుగు సినీ సాహిత్య జగతిలో సిరివెన్నెల సీతారామ శాస్త్రి పున్నమి వెన్నెల కురిపించారని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ అన్నారు. సాహితీ భారతి ఆధ్వర్యంలో సోమవారం జరిగిన సిరివెన్నెల సీతారామ శాస్త్రి 69వ జయంతి సందర్భంగా సిరివెన్నెల చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. సిరివెన్నెల 8 వందల పైచిలుకు సినిమాలకు 3వేల పాటలకు పైగా రచించారని అన్నారు. సిరివెన్నెల 11 నంది, 4 ఫిలిం ఫేర్ అవార్డులను అందుకున్నారని అన్నారు. సాహితీ భారతి కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ సిరివెన్నెల సీతారామ శాస్త్రి విధాత తలపున ప్రభవించినది, ఆది భిక్షువు వాడినేది కోరేది, జగమంత కుటుంబం నాది, నిగ్గదీసి అడుగు ఈ సిగ్గులేని జనాన్ని, బోటనీ పాఠముంది, ఈ వేళ్ళలో నీవు, బలపం పట్టి భామ బడిలో వంటి నవరసభరిత గీతాలు రచించారని అన్నారు. మర్రి మాల్యాద్రిరావు, మున్నం మస్తాన్‌రెడ్డి, కీర్తి వెంకయ్య, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామ చంద్రమూర్తి, కొమ్మూరి సీతారామాంజనేయులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో గ్రంథ పాలకురాలు ధనమ్మ

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - చీరాల

వేసవి కాలంలో విద్యార్థుల మేధాస్సు, నైపుణ్యాన్ని పెంచేందుకు నీతి కథలు, ఆటలు ఆడిస్తున్నట్లు గ్రంద పాలకురాలు ధనమ్మ తెలిపారు. వేసవి శిక్షణ తరగ తులు పిల్లల ఎదుగుదలకు దోహదపడతాయాని అన్నారు. తరగతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం చిత్రలేఖన పోటీలు నిర్వహిం చారు. జూన్ నెల 7వరకు జరుగుతాయని తెలిపారు.

'ఖరీఫ్' పంటలకు నీరివ్వాలి

- రైతు సంఘం నాయకులు
- గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల మరమ్మతు పనులు పరిశీలన



గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల మరరమ్మతులను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మద్దిపాడు

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఖరీఫ్‌లో పంటల సాగుకు నీరు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా నాయకుడు పమిడి వెంకటరావు, జిల్లా అధ్యక్షుడు జయంత్ బాబు కోరారు. మండల పరిధిలోని మల్లవరం గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ల మరమ్మతుల పనులను రైతు సంఘం నాయకులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతేడాది గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోవడంతో డ్యాంలో నీరంతా సముద్రం పాలు అయినట్లు తెలిపారు. దీంతో నీటి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటలకు నీరు అందించాలని, అందుకు తగినట్లుగా గేట్ల మర్మతు పనులను పూర్తి చేయాలన్నారు. కాలువల్లో పేరుకు పోయిన జనుము, ముళ్ళ చెట్లు, పూడికలు తొలగించాలన్నారు. అనంతరం ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోవడానికి గల కారణాలు, వాటిని పరిశీలన చేశారా? ప్రస్తుతం బిగిస్తున్న గేట్లు నాణ్యతగా ఉన్నాయా లేవా అని ఇరిగేషన్ డిఇని అడిగి తెలుసుకున్నారు. జులై ఆఖరి నాటికి గేట్ల మరమ్మతు పనులు పూర్తి చేస్తామని డిఇ చెప్పినట్లు వారు తెలిపారు. గతంలో గేట్ల మరమ్మతుల కోసం ధర్నాలు, పాదయాత్రలు చేసినట్లు తెలిపారు. అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే గేట్లు మరమ్మతులు పనులు జరుగుతుండగా వాటిని పరిశీలించినటు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కనపర్తి సుబ్బారావు, వెంకటరామిరెడ్డి, సిపిఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, నాయకులు ఉబ్బా వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం జిల్లా సహాయకార్యదర్శి శ్రీకాంత్, రావెళ్ల వెంకటరావు, గోగినేని బసవపున్నయ్య, దాసరి ఆంజనేయులు, చెరుకూరి వాసు తదితరులు పాల్గొన్నారు.

'టంగుటూరి'ని స్ఫూర్తిగా తీసుకోవాలి

తహశీల్దారు శ్రీనివాసరావు



నివాళులర్పిస్తున్న తహశీల్దారు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని తహశీల్దారు ఎ. శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని వినోదరాయిని పాలెంలో గ్రామాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. తొలుత గ్రామాభివద్ధి సంస్థ చైర్మన్ బైరపునేని సూర్యనారాయణ ఆధ్వర్యంలో వినోదరాయుని పాలెంలోని హైస్కూల్ ఆవరణలో ఉన్న ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ టంగటూరి ఆశయాలు ఆలోచనలు ఆదర్శనీయమన్నారు. నిస్వార్థ,నిరాడంబర రాజకీయ నేతగా, ముఖ్యమంత్రిగా ప్రకాశం అందించిన సేవలు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్వరాజ్య సాధన సమితి అధ్యక్షుడు జి. వీర భద్రాచారి, విద్యావేత్త చంద్రరావు, చల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-కొండపి



నివాళులర్పిస్తున్న నాయకులు

రైతు సమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహించిన కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు నాలుగో వర్ధంతి ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ రైతులు, రైతు కూలీల ప్రయోజనాల కోసం కొల్లి నాగేశ్వరరావు అలుపెరగని పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. చల్లపల్లి జమిందార్ మిగులు భూములు పంచడంలో కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు, దాసరి నాగ భూషణరావుతో కలిసి నాగేశ్వరరావు అనేక పోరాటాలు చేసి పేదలకు భూములు పంపిణీ చేశారన్నారు. నూజివీడు ప్రాంతంలో జరిగిన అనేక భూపోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొనున్నట్లు తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులపై జలదర్శిని పుస్తకాన్ని రచించి రాష్ట్రంలోని ప్రాజెక్టులపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. నాగేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా అనేక బాధ్యతలు నిర్వహించినట్లు తెలిపారు. రైతులు, రైతు కూలీల ప్రయోజనాల కోసం చివరి వరకూ పోరాడి అసువులు బాసి అమరుడయ్యాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి లక్ష్మి, చంద్రయ్య, మాల కొండయ్య, సాయి, సుబ్బారావు, అరుణ శేషమ్మ, మల్లేశ్వరి, వసంత, సుబ్బరత్నం తదితరులు పాల్గొన్నారు.

సాగుకు సన్నద్ధం..

- అల్పపీడన ప్రభావంతో వర్షాలు
- పదునెక్కిన భూములు
- నువ్వుల సాగుకు రైతుల ఆసక్తి



నువ్వులు ఎదబెడుతున్న రైతులు

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

అల్పపీడనం ప్రభావంతో గత మూడు రోజులుగా కురిసిన వర్షాలకు భూములు పదునెక్కాయి. దీంతో నువ్వుల పంట సాగు చేసేందుకు వాతావరణం అనుకూలంగా తయారైంది. నువ్వుల ధరలు కూడా ఆశాజనకంగా ఉండడంతో రైతులు ఈ పంట సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. మండల పరిధిలోని ఉప్పుగుండూరు, మాచవరం, ఓబన్నపాలెం, నాగులుప్పలపాడు గ్రామాల్లో ఆదివారం నుంచి నువ్వులు ఎదబెడుతున్నారు. మండలంలో సుమారు 9వేల ఎకరాల్లో నువ్వుల పంట సాగు చేసే అవకాశం ఉంది.. రోహిణి కార్తెముందే తొలకరి చినుకులు పడటంతో నువ్వుల పంట సాగులకు అనుకూలంగా ఉంటుందని, పంట అధిక దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ పాటికే కొందరు రైతులు నువ్వులు ఎదపెట్టారు. మరి కొందరు నువ్వులు ఎదబెట్టేందుకు హూతులు ఇప్పటి వరకూ వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గ్రాసం కోసం మూగజీవాలు అలమటించాయి. ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా కురిసిన వర్షంతో పశుగ్రాసం సమస్య కొంత మేర తీరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సుందరయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల కేంద్రమైన పిసిపల్లిలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ సభ్యులు గుంటగాని యాకోబు జెండాను ఆవిష్కరించారు. అనంతరం సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడటమే సుందరయ్యకు మనమిచ్చే నివాళులు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బడుగు జనార్ధన్, సిహెచ్.బ్రహ్మయ్య, జి.సుబ్బారావు, సిహెచ్.ఆశీర్వాదం, గుంటాని పిచ్చయ్య, వైద్య విద్యార్థి ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని ఉప్పుగుండూరు గ్రామంలోనున్న శ్రీవేణు గోపాలస్వామి ,ఆళ్వారాజుల దేవస్థానం బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గరుడ వాహనంతో బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. రాత్రి సింహ వాహనంపై నరసింహ అవతారంతో విద్యుత్ కాంతుల నడుమ స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పుజారి దీవి శ్రీధర్ బాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ పెంట్యాల జ్యోతి శ్రీనివాస్ , ఆలయ ఇఒ మీనిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు కేంద్రానికి ఎన్ఎన్.కండ్రిక, పెట్లూరు, వర్ధినేనిపాలెం, జగ్గరాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 908 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 850 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 58 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.310, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర రూ.252.06 పైసలు పలికినట్లు వేలం నిర్వాహణాధికారి తెలిపారు.

వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కొండపి

కొండపిలోని జాళ్లపాలెం రోడ్డులో కొలువైన ఉన్న శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి 9వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించారు. తొలుత పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాలొంగ్గన్నారు.

చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి-కొండపి

వేసవి విజ్ఞాన శిబిర కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో దాగున్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు చిత్రలేఖనం పోటీలు సోమవారం నిర్వహించారు. గ్రంథపాలకుడు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత కథలు చెప్పించారు. అనంతరం పుస్తకాలు చదివించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణా తరగుతులు

ప్రజాశక్తి-కొండపి

ప్రతి విద్యార్థి కాలంతో పరిగెడితే తాను అనుకున్న లక్ష్యం చేరుకో గలదని కొండపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇంగ్లీషు ఉపాధ్యాయులు తంగెళ్ల ప్రసాదు తెలిపారు. కొండపిలోని టిజె. ఇన్నోవేటివ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణా తరగతులను పశు సంవర్ధక శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ పి.బ్రహ్మయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తంగెళ్ళ ప్రసాద్ మాట్లాడుతూ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలంటే ప్రతి విద్యార్థి చక్కని చేతి రాత అవసరమని తెలిపారు. విద్యార్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ ఎల్‌వి.ప్రసాద్, వై.విశ్వనాగ అంబేద్కర్ , సత్యన్నారాయణ పాల్గొన్నారు.



సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న కోదాటి కోటేశ్వరరావు

ఐద్వా ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సమ్మర్ క్యాంపును స్థానిక సుందరయ్య భవన్లో సోమవారం ప్రారంభించారు. ప్రతి సంవత్సరం పిల్లలకు సమ్మర్ క్యాంపును క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. ప్రారంభం రోజున విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సమ్మర్ క్యాంపు కార్యక్రమం ఐదు రోజులపాటు నిర్వహిస్తామని ఐద్వా మండల కార్యదర్శి నెరుసుల మాలతి తెలిపారు. సమ్మర్ క్యాంపును జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు కోదాటి కోటేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు కుంచాల బుజ్జి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆటపాటలతో విద్య

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం గ్రంథపాలకుడు డివి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆటపాటల తో కూడిన విద్యను అందజేశారు. కథలు చదివించారు. విద్యార్థుల చేత చెప్పించారు. పాటలు పాడించారు. ఆటలు ఆడించారు. పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.



చెస్ ఆడుతున్న చిన్నారులు



క్యారమ్స్ ఆడుతున్న పిల్లలు

ఆరో రోజు వేసవి శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం ఆరో రోజు పిల్లలకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో భారత భాగవత రామాయణాల గురించి, స్వాతంత్య్ర సమర యోధుల జీవిత చరిత్రల గురించి అర్చకులు శివరామకృష్ణ పిల్లలకు వివరించారు. శిక్షణలో భాగంగా 6వ రోజు పిల్లలకు పుస్తక పఠనం, కథలు చదివించటం, కథలు చెప్పించటం, తెలుగు సంప్రదాయ గీతాలను పాడించడం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆటలు ఆడించారు. ఈ శిబిరంలో 15 మంది పిల్లలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు కె సత్యనారాయణ పాల్గొన్నారు.

పొగాకు కిలో అత్యధిక ధర రూ.312

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి సోమవారం సంతనూతలపాడు గ్రామ రైతులు 1274 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 1,159 బేళ్ల కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 115 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర రూ.312 పలుకగా అత్యల్ప ధర రూ.205 పలికింది. సరాసరి కిలో ధర రూ.260.54 పలికింది. వేలంలో 23 కంపెనీలు పాల్గొన్నాయి. వేలాన్ని వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ నిర్వహించారు.

దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో.. ఉత్తమ విద్యా బోధన..

గత నాలుగేళ్లుగా మండల టాపర్లుగా రాణిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్దదోర్నాలలో 1958లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ పాఠశాల ఉత్తమ బోధనకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. ఈ పాఠశాలలో ఎందరో విద్యార్థులు నేడు దేశ విదేశాల్లో ఉన్నత ఉద్యోగులుగా, రాజకీయ నాయకులుగా, వ్యాపారులుగా స్థిరపడ్డారు. అంత ప్రాముఖ్యత కలిగిన ఆ పాఠశాల ప్రస్తుతం జిల్లాలో టాప్-3 స్థాయిలో ఉంది. ప్రస్తుతం 1400 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలలో చదివిన వారంతా నిరుపేదలే. నాలుగేళ్లుగా మండలంలో మొదటి స్థానం.. మండల వ్యాప్తంగా జరుగుతున్న పరీక్షా ఫలితాల్లో గత నాలుగేళ్లుగా ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులే వరుసగా మండలంలో మొదటి స్థానంలో నిలుస్తున్నారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి ఫలితాల్లో కూడా స్పందన అనే విద్యార్థిని 584 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. విద్యార్థుల సామర్థ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. ఈ క్రమంలోనే విద్యార్థులు కూడా మంచి ఫలితాలు సాధిస్తూ పాఠశాలకు జిల్లా స్థాయిలో మంచిపేరు తీసుకువస్తున్నారు.



పాఠశాల ముఖద్వారం



ప్రభుత్వ పాఠశాల భవన సముదాయం

15 మంది ఉపాధ్యాయులతోనే విద్యాబోధన..

వాస్తవానికి ఆ పాఠశాలకు 41 మంది ఉపాధ్యాయులు అవసరం. అయితే కేవలం 15 మంది ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత తీర్చండి అంటూ ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా అధికారులు పట్టించుకోలేదు. అయినప్పటికీ ఉన్న 15 మంది ఉపాధ్యాయులే అదనపు పీరియడ్‌లు ఏర్పాటు చేసుకొని క్లాసులు నిర్వహిస్తూ విద్యార్థుల సామర్థ్యాన్ని పెంచి పదో తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులను ఆ పాఠశాలకు ఏర్పాటు చేసి విద్యార్థులకు మరింత మెరుగైన విద్య అందించేలా కృషి చేయాలని విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఉపాధ్యాయుల కృషితోనే మంచి మార్కులు సాధించా
స్పందన, పదో తరగతిలో మండల ఫస్ట్ విద్యార్థిని



మా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులను చదివించడంలో మంచి కృషి చేస్తున్నారు. తెలియని విషయాలను చక్కగా వివరిస్తున్నారు. అర్థం కాని విషయాలను రెండు మూడుసార్లు అర్థమయ్యేలా చెబుతున్నారు. అలా చెప్పడం మూలంగానే చక్కగా చదువుకొని మండల స్థాయిలో మొదటి స్థానం సంపాదించాను.

విద్యార్థులు చెప్పినట్లు వింటారు
నాగమూర్తి, ఉపాధ్యాయుడు, పెద్దదోర్నాల



మా పాఠశాలలో చదివే విద్యార్థులు మేము చెప్పినట్లు వింటారు. చాలా మంచివారు. అదనంగా స్టడీ క్లాసులు నిర్వహించినా ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వచ్చేవారు. చెప్పే ప్రతి విషయాన్ని జాగ్రత్తగా విని అర్థం చేసుకుంటారు. అందువల్లే ప్రతియేటా మా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపాం
నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, పెద్దదోర్నాల



పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ఉపాధ్యాయులను నియమించాలని ప్రభుత్వానికి నివేదికలు పంపాం. ప్రస్తుతం 15 మంది ఉపాధ్యాయుల తోనే పాఠశాలను నడిపిస్తున్నాం. ఉపాధ్యాయులను నియమించి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తే మా పాఠశాల జిల్లా స్థాయిలో ర్యాంకులు సాధించే అవకాశం ఉంది.

గిద్దలూరులో 'కార్డెన్ సెర్చ్'

ప్రజాశక్తి-గిద్దలూరు



కాలనీలోని ఓ ఇంటిలో తనిఖీ చేస్తున్న సిఐ సోమయ్య

పట్టణంలోని కృష్ణంశెట్టి పల్లికి వెళ్లే దారిలో ఉన్న జగనన్న కాలనీలో సోమవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జగనన్న కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో సరైన ధ్రువపత్రాలు లేని 2 మోటార్ సైకిళ్లు సీజ్‌చేశారు. ఈ సందర్భంగా గిద్దలూరు అర్బన్ సిఐ సోమయ్య మాట్లాడుతూ కార్డన్ సెర్చ్ వలన ప్రజల రక్షణ గురించి, ఎవరైనా కొత్త వ్యక్తులు గానీ, నేరస్తులు గానీ వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని, నేరరహిత పట్టణాలు, గ్రామాలుగా చేయాలనే ఉద్దేశంతో ఈ కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాలనీలో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కొమరోలు: కొమరోలు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి తాటిచెర్లలో ఆకస్మిక సోదాలు నిర్వహించారు. 2024 సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో హింసాత్మక సంఘటనల దృష్ట్యా రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ వ్యవస్థ అప్రమత్తమైంది. ఈ క్రమంలో తాటిచర్లలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా వచ్చారా, మారణాయుధాలు ఏమైనా వున్నాయా అనే కోణంలో సోదాలు కొనసాగుతున్నాయి. సరైన పత్రాలు లేని 11 బైకులను సీజ్‌చేసుకున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు. శాంతి భద్రతల పట్ల ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు.

మార్కాపురం: శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా మార్కాపురం పట్టణంలో కార్డన్ అండ్ సెర్చ్ సోమవారం నిర్వహించారు. తెల్లవారుజామున ప్రారంభమైన తనిఖీలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఈ కార్డన్ సెర్చ్‌లో పోలీస్ అధికారులు, సిబ్బంది ముఖ్యమైన కూడళ్లు, గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో పాత నేరస్తుల ఇళ్లు, పలు షాపులు, గడ్డి వాముల్లో తనిఖీలు చేపట్టారు. అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు మొదలైన వాటిని గుర్తించేందుకు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో మార్కాపురం డిఎస్‌పి ఎం బాలసుందరరావు, సిఐ ఆవుల వెంకటేశ్వర్లు, పట్టణ ఎస్ఐ షేక్ అబ్దుల్ రెహమాన్, మార్కాపురం రూరల్ ఎస్ఐ ఎం వెంకటేశ్వరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు అన్నదానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త మల్లిపెద్ది రవీంద్రబాబు తండ్రి మల్లిపెద్ది వెంకటేశ్వరరావు 4వ వర్ధంతి సందర్భంగా యర్రగొండపాలెం లోని మాచర్ల రోడ్డు సమీపంలోని సన్‌జో అనాథ, వృద్ధ, మానసిక, వికలాంగుల ఆశ్రయంలో ఆశ్రయం పొందుతున్న వారికి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు ఫ్రాన్సిస్.. మల్లిపెద్ది వెంకటేశ్వరరావు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా మల్లిపెద్ది రవీంద్రబాబు మాట్లాడుతూ తన తండ్రి వర్ధంతి సందర్భంగా ప్రతియేటా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మానసిక వికలాంగులకు అన్నదానం చేసినట్లు చెప్పారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ సన్‌జో సేవాలయంలో ఆశ్రయం పొందుతున్న మానసిక వికలాంగులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లిపెద్ది రవీంద్రబాబు దంపతులు, డి వెంకట రామయ్య, విట్టా కోటేశ్వర్లు, జ్యోతి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

వారం రోజులుగా నిలిచిన సాగర్ నీరు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

దూపాడు సమ్మర్ స్టోరేజీ ద్వారా యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు సాగర్ నీరు అందించే పైపులైన్లు మరమ్మతులకు గురి కావడంతో వారం రోజుల నుంచి పలు గ్రామాలకు సాగర్ నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగర్ నీటిని యర్రగొండపాలెం పట్టణానికి రెండు రోజులకు ఒకసారి సరఫరా చేస్తారు. అదే విధంగా పల్లెల్లో కూడా సరఫరా జరుగుతోంది. అయితే పైపులైన్లు మరమ్మతులకు గురి కావడం, వాటిని సరి చేయకపోవడంతో ఎక్కడి సరఫరా అక్కడ నిలిచిపోయింది. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వేసవి కాలం కావడం, గ్రామాల్లో ఉన్న డీప్ బోర్లన్నీ మొరాయించడంతో ఈ పాటికే నీటి కష్టాలు పడుతున్నారు. ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే అరకొర నీరు ఏమాత్రం సరిపోవడం లేదు. ఇటువంటి తరుణంలో సాగర్ నీరు కూడా సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి యుద్ధ ప్రతిపాదికన దూపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పైపులైన్‌కు మరమ్మతులు చేయించి దాని పరిధిలోని గ్రామాలకు సాగర్ నీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సత్రం భూములు అన్యాక్రాంతం కానివ్వం

• మాజీ ఎంఎల్ఎ కోన రఘుపతి • 78 సెంట్లు లీజుకు ఇచ్చేశామన్న ఈఒ • సత్రం భూమి ఐఓసీకి లీజికిస్తే ఉద్యమిస్తామన్న కాపు సంఘం



ఈఒకు వినతిపత్రం అందిస్తున్న కాపు సంఘం నాయకులు



మాట్లాడుతున్న కోన రఘుపతి

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలోని పేరం గరుడాచలం తూర్పు సత్రం ప్రాంగణంలో 78సెంట్ల స్థళం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు కేటాయిస్తూ దేవాదాయ శాఖ వచ్చిన ఉత్తర్వులపై తనకు ఎటువంటి సమాచారం లేదని ఎంఎల్ఎ కోన రఘుపతి తెలిపారు. ఆయన తన నివాసంలో విలేకరులతో సోమవారం మాట్లాడారు. ఈ ఉత్తర్వులకు వ్యతిరేకంగా పోరాటానికి, సత్రం ఆస్తుల పరిరక్షణకై న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దీనిపై కాపు సేవా సంఘం, తూర్పు సత్రం పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉద్యమ సమాచారం తెలుసుకున్న ఆయన స్పందించారు. బాపట్లకే తలమానికంగా ఉన్న పేరం గరుడాచలం నాయుడు తూర్పు సత్రం భూమిని ఐఒసికి లీజు ప్రాతిపదికన కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడుతున్న సమాచారం తనకు ముందస్తుగా తెలియదని అన్నారు. తూర్పు సత్రం భూములను ఈ తరహాగా ఏ ఇతర సంస్థకు కేటాయించడానికి తాను మద్దతు ఇవ్వబోనని చెప్పారు. ఈపాటికే వెలువడిన ఉత్తర్వులకు తాను వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని అన్నారు. క్రీడా ప్రాంగణం, క్రీడా మైదానం లేదా బహుళ ప్రయోజన కరమైన పార్కు, పుర ప్రజల ప్రయోజనార్థం అభివృద్ధి చేయాలనే సంకల్పంతో తాను ఉన్నట్లు గతంలోనే ప్రకటించానని చెప్పారు. రాబోయే ప్రభుత్వ హయాంలో అవకాశం మేరకు ఆ దిశగా అడుగులు వేస్తామని తెలిపారు.

భూములు లీజుకిస్తే ఉద్యమిస్తాం : కాపు సంఘం నాయకులు

పేరం గరుడాచలం నాయుడు తూర్పు సత్రం ప్రాంగణంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు స్థలాన్ని లీజుకి ఇవ్వడం పట్ల కాపు సంఘం నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో సోమవారం సమావేశం అయ్యారు. ఈఒ దివి వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందదజేశారు. ప్రజా ప్రయోజనాలకు వినియోగించే సత్రం స్థలాన్ని ఇతర సంస్థలకు కట్టబెడితే ఊరుకునేది లేదని వినతిపత్రంలో పేర్కొన్నారు.

78సెంట్లు ఐఓసికి లీజుకు ఇచ్చాం : ఈఒ డి వెంకటేశ్వర్లు

సత్రానికి సంబంధించిన 78సెంట్లు స్థలాన్ని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు లీజు ప్రాతిపదికన ఇచ్చినట్లు ఈఒ డి వెంకటేశ్వర్లు వివరణ ఇచ్చారు. స్థలానికి నెలకు రూ.47వేలు అద్దె చొప్పున ఐఓసీ చెల్లిస్తుందని తెలిపారు. ఒక ఏడాది అద్దె అడ్వాన్స్ గా రూ.5లక్షలు డిపాజిట్‌గా ఐఓసి చెల్లించే విధంగా స్థలాన్ని లీజికి ఇచ్చినట్లు తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని వాసవీనగర్‌లోని శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలో టంగుటూరి ప్రకాశం పంతులు 67వ వర్ధంతి సభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతిలో 550, ఆపైన మార్కులు సాధించిన 143మంది విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. బంగ్లా రోడ్డులోని ప్రకాశం పంతులు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రకాశం పంతులు ముని మనవరాలు సుభాషిణి చేతుల మీదుగా ఊటుకూరి కృష్ణసుభాన్, రావూరి రంగయ్య సౌజన్యంతో 31మంది విద్యార్థినీ, విద్యార్థులకు నగదు బహుమతి అందజేశారు. సంకా సుబ్రహ్మణ్యం(బాబు) సౌజన్యంతో విద్యార్థుల కోసం భారతీయ మహిళామణుల జీవిత చరిత్ర, సృజన కవి మిత్రుల కవితలను గాడేపల్లి దివాకరదత్ గ్రంథస్థం చేశారు. ఈ గ్రంథాన్నీ, ప్రకాశం గ్రంథాన్ని బహుమతులందుకొన్న విద్యార్థులకు అందజేశారు. ఊటుకూరి నరేంద్ర భోజన ఏర్పాట్లు చేశారు. ఊటుకూరి ఉమా అన్నపూర్ణ, వీరవల్లి సుబ్బారావు, డాక్టర్ యు దేవపాలన, అన్నమనేని వెంకట్రావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, డివిఎం సత్యనారాయణ, ఆర్ రాఘవరెడ్డి విద్యార్థులకు సందేశం ఇచ్చారు. నైపుణ్యం అందిపెచ్చుకుంటేనే జీవితంలో ఉన్నత అవకాశాలు అందుకుంటారని చెప్పారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పిల్లలపై వత్తిడి పెంచకూడదని అన్నారు. వారి ప్రతిభ సహజంగా పెంపొందేలా తోడ్పడాలని అన్నారు. ఇలపావులూరి శేషతల్పశాయి సభకు అధ్యక్షత వహించగా గాడేపల్లి దివాకర దత్, పాలపర్తి జ్యోతిష్మతి, షేక్ మహమ్మద్ రఫీ సభనిర్వహించారు. సృజన, రోటరీక్లబ్, కళాసంస్థల సభ్యులు పాల్గొన్నారు. 10వ తరగతిలో ప్రతిభ కనపరచిన 143 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్రకాశం మిత్ర మండలి మంచి గ్రంథాలను బహూకరించారు. వీరిలో అత్యుత్తమ మార్కులు సాధించిన 31 మంది విద్యార్థినీ, విద్యార్థులకు నగదు పురస్కారం అందజేశారు. స్థానిక హెూలి ఫైత్ పాఠశాల విద్యార్థిని కె జాహ్నవి (593), భాష్యం విద్యార్థిని నాగలక్ష్మీ శృతి(592), శ్రీచైతన్య విద్యర్థిని ఎన్ నిహిత(591), బి యశస్విని(589), హెూలీ ఫైత్ విద్యార్థిని బి సాయి సంహిత(588)లతోపాటు మరో 11మంది ప్రవేటు పాఠశాలల విద్యార్థులకు వూటుకూరి కృష్ణ సుభాన్ బహుమతులు అందజేశారు. తిమ్మాయపాలెం జెడ్ హైస్కూలు విద్యార్థి ఎస్ వెంకట పార్థసాయి(577), దేనువకొండ జెడ్పి హైస్కూలు విద్యార్థి అరవింద బాబు(575), స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థి జి పూజితాంజలి(571), తిమ్మాయపాలెం జెడ్పి హైస్కూలు విద్యార్థిని ఎస్ వెంకట హేమలత (568), పి వెన్నెల(568) తోపాటు మరో 10మంది విద్యార్థినీ, విద్యార్థులకు రావూరి రంగయ్య నగదు బహుమతి అందజేశారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నోరూరిస్తున్న తాటిముంజలు..

• డజను ముంజలు రూ.50, కాయ రూ.8 • తాటి ముంజలపై ఆసక్తి చూపుతున్న జనం • ఆరోగ్యానికి ముంజలు మేలు అంటున్న వైద్యులు

ప్రజాశక్తి - చీరాల

వేసవి కాలంలో తాటి ముంజలు తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. మండలంలోని బోయినవారిపాలెం, బుర్లవారిపాలెం, గవిని వారిపాలెం, వాడరేవు గ్రామాల్లో తాటి చెట్లు అధికంగా ఉన్నాయి. తాటి కాయ గెలలను పట్టణంలోకి తీసుకువచ్చి కాయలను విక్రయిస్తున్నారు. కాయ ఒకటి రూ.8లు, ముంజలు తీసి ఇస్తే డజను రూ.50 పలుకుతున్నాయి. వేసవి కాలం మాత్రమే దొరికే తాటి ముంజల కోసం పలువురు డజన్లు లెక్కన కొనుగోలు చేస్తుంటారు. దీంతో వేసవిలో తాటి ముంజలు ఉపాధి చూపుతున్నాయి. అందరికీ అందుబాటులో తాటి ముంజలు దొరుకుతూ ఉండడంతో వాటిని కొనుగోలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తాటి కాయ కాస్త ముదిరితే పండి కమ్మని సువాసన వస్తుంది. చాలా మందికి పండిన తాటికాయ కూడా తింటారనే విషయం తెలియదు. పండిన తాటి కాయ తింటే ఎన్నో రకాల అనారోగ్య సమస్యలు దూరం అవుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పండిన తాటి కాయలు శ్రావణ, భాద్రపద మాసంలో లభిస్తాయి. పండిన తాటికాయతో వివిధ రకాల వంటకాలు తయారు చేయవచ్చు. బెల్లం, మిఠాయి, తాడి మొదలైనవి దీనితో తయారు చేస్తారు. వీటిని మితంగా తినమని వైద్యులు సలహా ఇస్తుంటారు. పండిన తాటికాయతో తయారు చేసిన ఆహారాలు మరీ ఎక్కువగా తింటే జీర్ణ సంబంధిత సమస్య తలెత్తుతుంది. ప్రయోజనాలు ఉన్నాయి.



కారంచేడు గేటు వద్ద తాటి ముంజలు విక్రయిస్తున్న సాంబయ్య

తాటి పండు ఆరోగ్య ప్రయోజనాలు ఇవే

తాటి పండులో యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు క్యాన్సర్ నిరోధకంగా పనిచేస్తాయి. మంచి జ్ఞాపకశక్తిని కలిగిస్తాయి. మల బద్ధకం, ప్రేగు సంబంధిత వ్యాధులను నయం చేస్తాయి. తాటి పండులో ఉండే విటమిన్ బి వివిధ వ్యాధులను నివారించడంలో దోహదపడతాయి. వీటిల్లో కాల్షియం, ఫాస్పరస్ పుష్కలంగా ఉండటం వల్ల దంతాలు, ఎముకలు ఎల్లవేళలా ఆరోగ్యంగా ఉండేలా కాపాడుతాయి. కడుపులో వికారం తొలగించడంలో ప్రభావ వంతంగా పనిచేస్తాయి. దీర్ఘకాలిక దగ్గుతో బాధపడుతుంటే తాటి పండు తినడం వల్ల చక్కని ఉపశమనం పొందవచ్చు. తాటి పండులో విటమిన్ ఎ, బి, సి, జింక్, పొటాషియం, ఐరన్, కాల్షియం వంటి అనేక ఇతర ఖనిజాలు ఉన్నాయి. తాటిపండు తినడం లేదా గుజ్జు వేరుచేసి వివిధ వంటకాలు తయారు చేసుకోవచ్చు.

పండ్లతో అర్యోగం : వ్యాపారి సాంబయ్య

తాటి ముంజలు శరీరానికి ఎంతో చలవనిస్తాయని, తాటికాయతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, అయితే ఈ తరం యువత ఫాస్ట్ ఫుడ్‌కు ఇచ్చే ప్రాధాన్యత ప్రకృతి నుండి వచ్చే కాయలకు ఇవ్వడం లేదని ముంజల వ్యాపారి సాంబయ్య అంటున్నారు. తాను గవినివారిపాలెంలో నివాసం ఉంటూ తాటి కాయలను కొనుగోలు చేసి పట్టణంలో విక్రయిస్తున్నానని తెలిపారు. 2నెలల మాత్రమే ఉండే తాటి ముంజల రుచులను ఆస్వాదించాలని కోరారు.



ఎండిపోయిన తిమ్మరాజుపాలెం ఊర చెరువు

అడుగంటిన తాగునీటి చెరువులు

తాగునీటికి తప్పని ఇక్కట్లు

ప్రజాశక్తి - పర్చూరు

పర్చూరుకు మంచినీటి కష్టాలు ముంచుకొచ్చే పరిస్థితి ఏర్పడింది. వేసవిలో నీటి ఎద్దడిని అధికమించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన సాగరు నీరు మూడు, నాలుగు ముచ్చటగా మిగిలిపోయాయి. నీటిని చెరువులకు నింపేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టక పోవడంతో నీటి సరఫరా ప్రశ్నార్థకంగా మిగిలింది. చెరువులను ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సమన్వయంతో సాగర్ జలాలతో చెరువులు నింపాల్సి ఉంది. సకాలంలో సంబంధిత అధికారులు స్పందించక పోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ప్రజలు విమర్శిస్తున్నారు. దీనికి తోడు పర్చూరు ఆయకట్టు చివర ఉండటం సాగర కాలవల్లో చిల్ల చెట్లు, ముళ్ళ పొదలు పెరిగిపోయి నీటి సరఫరా జరగకపోవడం ప్రధాన కారణం. దీనివల్ల పర్చూరు చెరువుకు సాగర్ నీరు అరకొరగానే చేరింది. పర్చూరులో ఉన్న రెండు మంచినీటి చెరువుల్లో ఒక చెరువులో నీరు పూర్తిగా అడుగంటింది. ప్రస్తుతం వేసవి దృష్ట్యా ఎన్ని రోజులు నీరు అందుబాటులో ఉంటుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. పర్చూరులో 20వేలకు పైచిలుకు జనాభా ఉంది. ప్రస్తుతం రెండు రోజులకు ఒకసారి పంచాయతీ ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. పర్చూరు ఆర్ఒ ప్లాంట్ ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు మంచినీటిని వాడుకుంటున్నారు. దీంతో ప్రస్తుతం చెరువులో ఉన్న నీటి పరిమాణం తక్కువగా ఉండటంతో వేసవిలో నీటి పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పర్చూరు, పెద్దివారిపాలెం, నాగులపాలెం చెరువులు తిమ్మరాజుపాలెం పరిస్థితి ఇదే విధంగా ఉంది. ఏది ఏమైనా ఆయా శాఖాధికారులు జాప్యం ప్రజలకు శాపంగా మారింది. దీంతో వేసవిలో నీటి ఎద్దడి తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రుతు పవనాలు వస్తాయని, వర్షాలతో కాస్త చెరువుకు నీరు చేరుతుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

అక్రమ తవ్వకాలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కృష్ణా నద పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, సుప్రీంకోర్టు నిబంధన ప్రకారం అక్రమ తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని రేపల్లె ఆర్డిఓ హేల షారోన్ హెచ్చరించారు. కొల్లూరు, భట్టిప్రోలులో కలెక్టర్, ఎస్‌పి తనిఖీల అనంతరం ఓలేరు ఇసుక రిచ్‌లో ఆమె పరిశీలించారు. కోర్టు నిబంధనలు పాటించాలని సూచించారు. ఆమె వెంట భట్టిప్రోలు తహాశీల్దారు ఐ మునిలక్ష్మి, మైనింగ్, రెవిన్యూ అధికారులు ఉన్నారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని అన్నంబొట్లవారిపాలెం శ్రీ కోదండరామ స్వామి 31వ వార్షిక సప్తాహం ముగింపు అన్నదానం చేశారు. కందులూరి ఆశ్రమ పీఠాధిపతి నామానంద చావా నాగేశ్వరరావు బృందం ఆలపించిన కీర్తనలు ఆహుతులు అలరించాయి. కార్యక్రమంలో మర్రి అన్నపూర్ణమ్మ, నర్రా సుబ్బాయమ్మ, మర్రి నాగయ్య పాల్గొన్నారు.

నేటి నుండి పావులూరు తిరునాళ్ల

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

శ్రీ పొలిమేర వీరాంజనేయస్వామి 70వ తిరునాళ్ళ మంగళవారం నుండి గురువారం వరకు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తిరునాళ్ళకు వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా అన్నదానం, తాగునీటికి చలివేంద్రాలు వివిధ స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

స్ట్రాంగ్ రూమ్స్‌కు మూడంచెల భద్రత

పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఈవీఎంలు భద్రపరచిన స్ట్రాంగ్ రూమ్స్‌కు మూడంచెల భద్రత కల్పించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈవిఎంలు భద్రపరచిన సెంట్రలైజ్డ్ స్ట్రాంగ్ రూమ్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్.దినేష్‌కుమార్ సోమవారం సందర్శించారు. జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు కార్యక్రమం ఇక్కడే ఉండటంతో కౌంటింగ్ హాల్స్ కోసం చేస్తున్న ఏర్పాట్లను కూడా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవిఎంలు భద్రపరచిన ఈ ప్రాంగణానికి సాయుధ బలగాలతో మూడంచెల భద్రతను కల్పించామని, ప్రాంగణం మొత్తాన్ని సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉంచామన్నారు. గుర్తింపు కార్డులను పరిశీలించి, క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే ఇందులోకి సిబ్బందిని అనుమతిస్తునట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపునకు అనుగుణంగా కౌంటింగ్ హాల్స్ ఏర్పాటు, అందులో టేబుల్స్ వేసే విధానం, పార్కింగ్, బ్యారికేడ్ల ఏర్పాటు విషయంలో సిబ్బందికి పలు సూచనలు చేశామన్నారు. ఈ ప్రాంగణంలో కమాండ్ మరియు కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, పోటీ చేసిన అభ్యర్థులు, వారి తరపున ఏజెంట్లు, ప్రతినిధులు వారి గుర్తింపు కార్డులను చూపించి ఇందులో కూర్చుని సిసి కెమెరాల ద్వారా స్ట్రాంగ్ రూమ్స్ వద్ద పరిస్థితిని పరిశీలించవచ్చని కలెక్టర్ చెప్పారు. కౌంటింగ్ సిబ్బందికి కూడా ఈ ప్రాంగణంలోనే త్వరలో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట గిద్దలూరు ఆర్‌ఓ నాగజ్యోతి, ఇతర అధికారులు ఉన్నారు.



రిజిష్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఖాళీ బిందెలతో నిరసన

కొప్పోలులో తాగునీటి కోసం రాస్తారోకో

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానిక తొమ్మిదో డివిజన్ కొప్పోలులో ప్రజలు రోడ్డెక్కారు. సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. నగరపాలక సంస్థ అధికారులు వారానికి ఒకసారి పైప్ లైన్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారని, ఆ నీరు సక్రమంగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి పది ఇళ్లకు నీరు వస్తే చివరి ప్రాంతాలకు సరఫరా కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అనేకసార్లు ఈ సమస్యను అధికారుల దష్టికి తీసుకు వెళ్లామని వివరించారు. సమస్యను పరిష్కరిస్తామని అధికారులు అనేక సార్లు హామీలు ఇచ్చినా నెరవేరలేదని పేర్కొన్నారు. గత్యంతరం లేని పరిస్థితిలో తాగునీటి ట్యాంకర్లు కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోయారు. తాగునీటికి, వాడుకనీటికి నిత్యం ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఊరిలోనే చెరువు ఉన్నప్పటికీ తమ సమస్య పరిష్కారం కావడం లేదని వివరించారు. స్థానికుల రాస్తారోకోతో ఒంగోలు- కొత్తపట్నం రోడ్‌లో వాహనాల రాక పోకలు నిలిచిపోయాయి. సుమారు గంటకు పైగా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న నగరపాలక సంస్థ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రఘురాం, ట్యాప్ ఇన్స్‌పెక్టర్ నరసింహారావు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రఘురాం మాట్లాడుతూ కొప్పోలులో మూడు అంగుళాల పైపులైన్లు స్థానంలో నాలుగు అంగుళాల పైప్ లైన్‌లు ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు. ఇందుకోసం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.31 కోట్లతో కొత్త పైపు లైన్లు ఏర్పాటుకు టెండర్లు పిలిచామని చెప్పారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్ పని చేయడం లేదని వివరించారు. సదరు కాంట్రాక్టర్‌కు ఇప్పటికే మూడుసార్లు నోటీసులు పంపామని చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మరో సారి ఫైనల్ నోటీసు పంపిస్తామని, అప్పటికీ పని ప్రారంభం కాకపోతే ఆ పనిని రద్దుచేసి తిరిగి టెండర్లు పిలుస్తామని చెప్పారు. రెండు, మూడు రోజుల్లో సాగర్ నీరు రామతీర్థం నుండి ఒంగోలులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులకు విడుదల కానుందని చెప్పారు. ఆ నీటితో కొప్పోలు చెరువులు కూడా నింపుతామని హామీ ఇచ్చారు. కొత్త పైపులైన్లు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు ప్రజలకు సరిపడా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. కొన్నిచోట్ల నీటి విడుదలకు వాల్వు సమస్య ఉందని, ఆ సమస్య పరిష్కరిస్తున్నామని చెప్పారు. కొప్పోలులో నెలకొన్న సమస్యను ఉన్నతాధికారులకు కూడా నివేదించామని వివరించారు. త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తమ సమస్య పరిష్కారం అయ్యేవరకు రోడ్డు విడిచి వెళ్లేది లేదని ,ఇక్కడే ఉంటామని ప్రజలు అధికారులకు తేల్చి చెప్పారు. సమస్యపై అధికారులు, ప్రజలకు మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగాయి. ఉన్న వాస్తవ పరిస్థితులను అధికారులు, ప్రజలు చర్చించారు. పైపులైన్‌ల సమస్య పరిష్కారం అయ్యేవరకు ట్యాంకర్లను పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ సరిపడా పంపిణీ చేయాలని ప్రజలు కోరారు. అందుకు అధికారులు అంగీకరించారు. దీంతో ప్రజలు రాస్తారోకోను విరమించారు.



రాస్తారోకో చేస్తున్న కొప్పోలు వాసులు

23 నుంచి క్రికెట్ సెలక్షన్స్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా అడహక్ కమిటీ ఆధ్వర్యంలో 2024-25 అకడమిక్ ఇయర్‌కి సంబంధించి డిస్ట్రిక్ట్ క్రికెట్ టీమ్ సెలెక్షన్స్ ఈ నెల 23 నుంచి నిర్వహించనున్నట్లు కమిటీ ఛైర్మన్ ఎన్.గీత తెలిపారు. ఒంగోలులోని మంగమూరు రోడ్డులో ఉన్న మినీ లార్డ్స్ గ్రౌండ్స్‌లో సెలక్షన్స్ జరుగుతాయన్నారు. ఈ నెల 23న మధ్యాహ్నం 2.30 గంటలకు సీనియర్ మెన్స్ మరియు అండర్- 23 మెన్స్‌కు, 23న తొమ్మిది గంటలకు అండర్-19 బాయ్స్, 24న ఉదయం 9 గంటలకు ఉమెన్స్ సెలక్షన్స్ (సీనియర్స్, అండర్-23, అండర్-19, అండర్-15), 24న మధ్యాహ్నం 2.30 గంటలకు అండర్-16 బాయ్స్‌కు సెలక్షన్స్ జరుగుతాయన్నారు. సెలక్షన్స్ పాల్గొనదలచిన వారు ఒరిజినల్ జననధవీకరణ పత్రం ఫార్మ్- 5 మరియు జిరాక్స్, ఆధార్ జిరాక్స్, స్టడీ సర్టిఫికేట్, గత మూడు సంవత్సరాల మార్క్ లిస్ట్, డ్రస్ కోడ్, ఉమెన్ అండ్ గర్ల్స్ కలర్ డ్రస్, మెన్స్ అండ్ బాయ్స్- వైట్ డ్రస్, కిట్స్ తెచ్చుకోవాలన్నారు. ఉమెన్స్ సెలెక్షన్స్ సంబంధించి వివరాలకు 7013026688 నెంబర్‌ను, మెన్ అండ్ బాయ్ సంబంధించి వివరాలకు 7893160143 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కొలుకులలో పోలీసుల సోదాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల గ్రామంలో సోమవారం రాత్రి పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఒకేసారి పెద్ద సంఖ్యలో పోలీసులు గ్రామంలోకి రావడంతో గ్రామస్తులు భయాందోళనలకు గురయ్యారు. గ్రామానికి నలువైపులా తనిఖీలు చేపట్టి గ్రామంలో ఉన్న వారిని బయటకు వెళ్లకుండా బయట వారిని గ్రామంలోకి రానివ్వకుండా కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. గహాలు, శిథిలావస్థలో నిరుపయోగంగా ఉన్న గృహాలు, వాముల్లో, కొష్టాల్లో, పొదల్లో సోదాలు చేశారు. సరైన పత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంధర్భంగా యర్రగొండపాలెం సిఐ రాములు నాయక్ మాట్లాడుతూ చట్టం ఎవరికి చుట్టం కాదని, తప్పున చేసిన వారు ఎంతటి వారికైన శిక్ష తప్పదన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అంసాంఘీక శక్తులను ఊరుకునేది లేదని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. 2, 3 కేసుల్లో ఉంటే శిక్ష కఠినతరం చేస్తామన్నారు. ఫలితాలు వెలువడే వరకు ఎటువంటి గొడవలు జరుగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుదర్శన్, ఏఎస్సై శ్రీనివాసరావు, కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలు జరిపితే కఠినచర్యలు

- అనుమతుల్లేకుండా ఇసుక తవ్వితే చట్టబద్ధమైన చర్యలు..
- సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలి
- మైనింగ్ అధికారులకు కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశం

ప్రజాశక్తి-మేదరమెట్ల

అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలను జరిపినట్లైతే చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా కలెక్టర్ పి. రంజిత్ భాష అన్నారు. సోమవారం మండలంలోని అనమలమూరు గ్రామంలో గతంలో ఇసుక తవ్వకాలు జరిగిన ప్రదేశాలను ఆయన పరిశీలించారు. తదుపరి ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ఇసుక తవ్వకాలను రహస్యంగా జరిపించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఏ మోతాదులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయో పరిశీలించాలని అధికారులకు సూచించారు అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపించే వారిపై కేసులు నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈయనతో పాటు జిల్లా ఎస్.పి వసూల్ జిందాల్ ,ఆర్డిఓ ఆర్ రామకష్ణారెడ్డి ,చీరాల డి.ఎస్.పి బేతపూడి ప్రసాద్ ,అద్దంకి రూరల్ సీఐ శివరామకష్ణారెడ్డి ,తాసిల్దార్ పి. సుశీల మరియు మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని కృష్ణానది ఇసుక రీచ్‌లను కలెక్టర్ పి రంజిత్ భాష, ఎస్పీ వకుల్ జిందాల్, రేపల్లె ఆర్డిఓ హేలా షారోన్ సోమవారం పరిశీలించారు. గత ఐదేళ్ళుగా వైసీపీ ప్రభుత్వ పాలనలో కృష్ణా నదిలో ఇసుక అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో నాయకులు దోచుకున్నారని ఇటీవల వేమూరు టిడిపి అభ్యర్థి, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఆరోపించారు. ఆరోపణల నేపథ్యంలో ఇసుక రీచ్‌లను కలెక్టర్, ఎస్పీ, మైనింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఏఏ రీచ్‌లలో ఎంత ఇసుక తరలించారు. ఏ విధంగా తరలించారనే కోణంలో స్వయంగా పరిశీలించి నివేదికలు సిద్ధం చేసుకున్నారు. ఆయా రీచ్‌లలో ప్రొక్లైన్ల ద్వారా పెద్దపెద్ద గుంటలు పెట్టి లక్షల కొద్దీ లారీలతో ఇసుక తరలించిన విషయాన్ని గుర్తించారు.



భట్టిప్రోలులో ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

తప్పుదోవ పట్టించే ప్రయత్నంలో మైనింగ్ అధికారులు

ఆయా రిచ్‌లలో అక్రమంగా అధికార వైసిపి నాయకులు అక్రమంగా తవ్విన ఇసుక గోతులను కలెక్టర్, ఎస్పీ చూడకుండా తప్పుదోవ పట్టించే విధంగా మైనింగ్ అధికారులు ప్రయత్నించారు. అసలు తవ్విన ప్రాంతాన్ని వదిలేసి ఏమీ లేని ప్రాంతాన్ని చూపించేందుకు మైనింగ్ అధికారి స్వయంగా తానే మరో ప్రాంతాకి వెళ్లి చూద్దాం రండి అంటూ దారి మళ్ళించి ప్రయత్నం చేయడం పట్ల అక్కడకు వచ్చిన గ్రామస్తులు విస్మయం వ్యక్తం చేశారు. అసలు ప్రాంతాన్ని పరిశీలన చేపట్టకుండా సాక్షాత్తు మైనింగ్ అధికారులే పక్క ప్రాంతానికి తీసుకెళ్లడంతో అక్కడున్న వారంతా మైనింగ్ అధికారులపై అగ్రహారం చేశారు. సంబంధిత అధికారులే ఈ విధంగా తప్పు దోవ పట్టిస్తే ఇంకా ఏ విధంగా అసలు విషయం బయటకు వస్తుందని ప్రశ్నిస్తున్నారు. ఒక దశలో అక్కడ ఉన్న విలేకరుల సైతం ఈ ప్రాంతంలో కాదు పక్క ప్రాంతంలో పెద్ద పెద్ద గుంటలతో ఇసుకను తరలించారని, గుంటలు ఉన్నాయని వాటిని చూడండి సార్ అని చెప్పినప్పటికీ మైనింగ్ అధికారులు విలేఖరులను వారించారు. పక్కకు తీసుకు వెళ్ళటం తీవ్ర చర్చనీయాశ మైంది. కార్యక్రమంలో రేపల్లె డిఎస్పి, వేమూరు సిఐ కొల్లూరు, భట్టిప్రోలు మండలాల ఎస్సైలు, తాసిల్దారులు, రెవెన్యూ సిబ్బంది, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

కొల్లూరు : మండలంలోని జువ్వలపాలెం, గాజులంక ఇసుక రీచ్‌లను కలెక్టర్ పి రంజిత్ భాష, ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం పరిశీలించారు. వారి వెంట రేపల్లె డిఎస్పి మురళీకృష్ణ, రేపల్లె ఆర్డిఓ హేలా షారోన్, వేమూరు సిఐ రామకృష్ణ, కొల్లూరు తహశీల్దారు పుల్లారావు, కొల్లూరు ఎస్ఐ రవీంద్రారెడ్డి, డిస్టిక్ మైనింగ్ అధికారులు పాల్గొన్నారు.

రేపల్లె : పెనుముడి ఇసుక రిచ్‌లను కలెక్టర్ పి రంజిత్ భాష, ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈనెల 12న భారత ఉన్నత న్యాయస్థానం హరిత ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు మేరకు జిల్లాలో ఇసుక రీచ్లు మూసి వేయడం జరిగిందని తెలిపారు. ఎవరైనా అక్రమంగా తీసుక తవ్వి తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రంజిత్ భాష హెచ్చరించారు. రేపల్లె, భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో ఇసుక అక్రమంగా తరలిస్తూ ఉన్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇసుక రీచ్‌లను ఆకస్మికంగా పరిశీలించినట్లు తెలిపారు. ఇటీవల సుప్రీంకోర్టు జారీ చేసిన జీఓ ఎంఎస్ నెంబర్ 71, 25 ప్రకారం ఇసుక అక్రమ తవ్వకాలు చేసే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు. ఇసుక రీచ్‌లను మూసివేసినట్లు తెలిపారు కార్యక్రమంలో బాపట్ల డిఆర్‌ఓ సత్తిబాబు, రేపల్లె ఆర్టిఓ హేలా షారోన్, తహశీల్దారు రవీంద్రబాబు, విఆర్‌ఓ రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి విజయ వర్ధని పాల్గొన్నారు.

ముండ్లమూరు : సుప్రీం కోర్టు ఉత్తర్వులు, కలెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్ అధికారుల బృందం మండలంలోని ఇసుక రీచ్‌లను సోమవారం పరిశీలించారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అరెస్టు చేస్తామని హెచ్చరించారు. పోలవరం, మారెళ్ళ, పసుపుగల్లు, చింతలపూడి, తమ్మలూరు, జమ్మలమడక గ్రామాల్లోని ఇసుక రీచులను మైనింగ్ అధికారులు బృందం పరిశీలించారు. మైనింగ్ అధికారి ఏరేసు మాట్లాడుతూ పై గ్రామాల్లోని ఏ రీచ్‌లోనైనా అధికారుల అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తరలిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అరెస్టు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. తహశీల్దారు జె మధుబాబు మాట్లాడుతూ మండలంలో ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా ఇసుక తరలిస్తుంటే తన దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సుందర రామయ్య, డిటి జి పుల్లారెడ్డి, విఆర్‌ఒలు పాల్గొన్నారు.